రాజంపేట పార్లమెంట్ పరిధిలో జరిగిన భారీ క్రాస్ ఓటింగ్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కొంప ముంచింది. కూటమి అసెంబ్లీ అభ్యర్థులకు ఓటు వేసిన వారంతా పార్లమెంటు విషయంలో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారు. ఆ నాలుగుచోట్లా ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓట్లు వేసినా, పార్ల మెంటు విషయంలో బీజేపీ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డికి కాకుండా వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి ఓటు వేశారని స్పష్టమవుతోంది.

కొంపముంచిన క్రాస్ ఓటింగ్

- కిరణ్‌ను దెబ్బతీసిన మైనార్టీలు
- 20,448 ఓట్లతో గెలవాల్సిన బీజేపీ..
- 70,071 ఓట్ల మెజారిటీతో వైసీపీ గెలుపు





మదనపల్లె, జూన్ 8: జిల్లాలోని రాజంపేట పార్లమెంట్ పరిధిలో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు స్పష్టమవుతోంది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఆయా పార్టీ విజేతల ఓట్లను లెక్కిస్తే క్రాస్ ఓటింగ్ జరిగిందన్న అంశం నిర్ధారణ అవుతోంది. జిల్లాలోని మదనపల్లె, పీలేరు, రాయచోటి, రైల్వేకోడూరులో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. వీరికొచ్చిన మెజార్టీ లెక్కిస్తే 44,186 ఓట్లు నమోదయ్యాయి. అలాగే తంబళ్లపల్లె, రాజంపేట, పుంగనూరులో వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. వీరి మెజార్టీ తీసుకుంటే 23,738 ఓట్లు నమోదయ్యాయి. అయితే పార్లమెంటులో వైసీపీ నుంచి పోటీ చేసి విజయం సాధించిన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి 76,071 ఓట్ల మెజారిటీ వచ్చింది. ఇదిలా ఉండగా కూటమి అభ్యర్థులు ఎం.షాజహాన్‌బాషా, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, అరవ శ్రీధర్ ఓట్లు మొత్తం కలిపి మెజారిటీ 44,186 ఓట్లు వచ్చాయి. అలాగే వైసీపీ అభ్యర్థులు పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిల మొత్తం మెజారిటీ ఓట్లు 23,738 ఓట్లు ఉన్నాయి. విజయం సాధించిన నలుగురు కూటమి అభ్యర్థుల మెజారిటీ ఓట్లను, ముగ్గురు వైసీపీ అభ్యర్థులకు వచ్చిన మెజారిటీ ఓట్లలో తీసేస్తే 20,448 ఓట్లు మిగులుతాయి. ఈ ఓట్లతో రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మెజారిటీతో గెలివాల్సి ఉంది. కానీ ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కంటే 76,071 ఓట్ల తక్కువతో బీజేపీ అభ్యర్థి ఓడిపోయారు. అంటే కూటమి అసెంబ్లీ అభ్యర్థులకు ఓటు వేసిన వారంతా పార్లమెంటు విషయంలో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారు. ఆ నాలుగుచోట్లా ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓట్లు వేసినా, పార్లమెంటు విషయంలో బీజేపీ అభ్యర్థి, మాజీ ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డికి కాకుండా వైసీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి ఓటు వేశారని స్పష్టమవుతోంది.

అంచనాలు తారుమారు..

పోలింగ్ రోజున అంతా ఊహించిన దానికీ, వెలువడిన ఫలితాలకు తేడాతో పాటు అందరి అంచనాలు తారుమారయ్యాయి. జిల్లాలోని పార్లమెంటు పరిధిలో గెలిచిన వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలకు ఓటర్లు ఓటు వేయకపోయినా, ఎంపీ అభ్యర్థి విషయంలో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డికి ఓట్లు వేశారనే ప్రచారం ముమ్మరంగా సాగింది. అలాగే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థుల విష యంలోనూ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. కానీ తీరా చూస్తే అనుకున్నది ఒకటైతే.. అక్కడ జరిగింది మరొకటి కావడంపై అటు అభ్యర్థులే కాదు..రాజకీయ విశ్లేషకులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ముస్లిం మైనార్టీలు ఎక్కువగా ఉన్న మదనపల్లె, పీలేరు, రాయచోటి, పుంగనూరులోని ఓటర్లు ఎక్కువగా వైసీపీ అభ్యర్థి వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. బీజేపీకి కాదనుకున్నా.. వారంతా అటు వైసీపీకి లేదా పెద్దిరెడ్డి కుటుంబానికి ఓటు వేయడానికి ఇష్టపడని వారంతా కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నది ఫలితాలను బట్టి వెల్లడవుతోంది.

కిరణ్‌కుమార్‌రెడ్డికి సానుకూలత ఉన్నా...

సీఎం హోదాలో ఆయన ఉమ్మడి చిత్తూరు జిల్లాకు, ముఖ్యంగా పీలేరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, కిరణ్‌కుమార్‌రెడ్డిపై ప్రజల్లో సానుకూలత ఉన్నా బీజేపీ గుర్తుకు ఓటు వేయలేదని చెబుతున్నారు. అదే టీడీపీ నుంచో లేక జనసేన నుంచి పోటీ చేసి ఉన్నా.. నమోదైన ఫలితాల మేరకు కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా 20,448 ఓట్ల మెజారిటీతో ఎంపీగా విజయం సాధించే అవకాశం కనిపిస్తోంది. ఇందులో భాగంగానే ఎమ్మెల్యేకు ఓటు వేసిన ఓటరే.. ఎంపీకి కూడా వేసేవారని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో 2014 ఎన్నికల్లో తంబళ్లపల్లె నియోజకవర్గంలో వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా చేసిన ఎ.వి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి 6,250 ఓట్ల తేడాతో టీడీపీ అభ్యర్థి జి.శంకర్‌యాదవ్‌తో ఓడిపోతే, అదే నియోజకవర్గంలోని వైసీపీ నుంచి రాజంపేటకు పోటీ చేసిన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి సుమారు పదివేల ఓట్లు మెజారిటీ వచ్చింది. ప్రస్తుతం ఇదే విషయాన్ని ప్రస్తావిస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా మెజార్టీ పరిశీలిస్తే...

మదనపల్లెలో కూటమి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా (97,980 ఓట్లు), సమీప ప్రత్యర్థి ఎస్.నిసార్ అహమ్మద్ (92,471 ఓట్లు)పై 5,509 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పీలేరు నుంచి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి(1,05,582), సమీప వైసీపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి(80,501)పై 25,081 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. రాయచోటి నుంచి కూటమి అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి(95,925), ప్రత్యర్థి గడికోట శ్రీకాంత్‌రెడ్డి (93,430)పై 2,495 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. రైల్వేకోడూరులో జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ (78,594), ప్రత్యర్థి కొరముట్ల శ్రీనివాసులు (67,493)పై 11,101 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాగా, రాజంపేట వైసీపీ అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి (92,609), ప్రత్యర్థి, కూటమి అభ్యర్థి సుగవాసి బాలసుబ్రహ్మణ్యం (85,593)పై 7,016 ఓట్ల మెజారిటీ సాధించారు. తంబళ్లపల్లెలో పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి (94,856), కూటమి అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి (85,119)పై 10,103 ఓట్ల మెజారిటీ సాధించారు. అలాగే చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గ అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (99,774), కూటమి అభ్యర్థి చల్లా బాబురెడ్డి (93,155)పై 6,619 ఓట్ల మెజారిటీతో బయటపడ్డారు.

అమాత్యయోగం ఎవరికో?

- ఉమ్మడి జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఎన్నిక
- పొరుగు జిల్లాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలుగా మనోళ్లు
- మంత్రివర్గంలో చోటు కోసం యత్నాలు



సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సునామీ సృష్టించారు. గెలుపు కిక్ నుంచి ఇంకా శ్రేణులు బయటికి రాలేదు. అయితే ఇంతలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు అవుతున్నాయి. మోదీ మూడోసారి ఆదివారం ప్రమాణ స్వీకారం చేస్తుండగా.. ఈనెల 12వ తేదీ బుధవారం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అదేరోజు కానీ, తరువాత కానీ మంత్రివర్గం కొలువుదీరనుంది. ఈ నేపథ్యంలో అమాత్యయోగం ఎవరికి దక్కుతుందో అంటూ జిల్లాలో చర్చ జరుగుతోంది.



(కడప-ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలకు గాను ఏడుచోట్ల కూటమి అభ్యర్థులు గెలుపొందారు. ఇక అనకాపల్లి, ఏలూరు ఎంపీలుగా సీఎం రమేశ్, పుట్టా మహేశ్‌యాదవ్ గెలిచారు. ధర్మవరం ఎమ్మెల్యేగా జిల్లా వాసి సత్యకుమార్ గెలిచారు. అయితే కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరికి చోటు దక్కుతుందనే ఆసక్తి అందరిలో నెలకొంది. ఎందుకంటే అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో మనోళ్ల పేర్లే చర్చకు వస్తున్నాయి. సామాజికవర్గాల ఆధారంగా మంత్రివర్గం కూర్పు ఉంటుంది. అన్నివర్గాలకు మంత్రివర్గంలో సమప్రాధాన్యం ఉంటుంది. దీంతో ఆయా వర్గాల్లో ఇప్పుడు ఎవరికి పదవి వస్తుందనే చర్చ నడుస్తోంది.

కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, రాయచోటి నుంచి ఎమ్మెల్యేలు మాధవీరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, ఎన్.వరదరాజులరెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి టీడీపీ తరఫున గెలిచారు. ఇక జమ్మలమడుగు నుంచి ఆదినారాయణ రెడ్డి బీజేపీ తరఫున, రైల్వేకోడూరు నుంచి అరవ శ్రీధర్ జనసేన తరఫున గెలిచారు. వీరంతా మంత్రివర్గంలో చోటు సంపాదించేందుకు ఎవరి ప్రయత్నాలు వారు మొదలుపెట్టారు. ఉమ్మడి కడప జగన్ సొంత జిల్లా. 2004 తరువాత వరుసగా నాలుగుదఫాలుగా జరిగిన ఎన్నికల్లో టీడీపీ గెలుపు రుచి చూడని నియోజకవర్గాలున్నాయి. ఈసారి కూటమి అభ్యర్థులు ఏడుగురు గెలిచి మళ్లీ 1999 ముందునాటి పరిస్థితులు రావడంతో టీడీపీకి పూర్వవైభవం వచ్చింది. జగన్ సొంత జిల్లాలోనే కూటమి అభ్యర్థులు అనూహ్య విజయం సాధించారు. దీంతో కూటమి ఇక్కడ మరింత పటిష్ఠమయ్యేందుకు మంత్రివర్గ విస్తరణలో పదవులు దక్కుతాయని అంటున్నారు. అయితే ఎవరెవరికి దక్కుతాయనే చర్చ నడుస్తోంది. మంత్రివర్గంలో రకరకాల పేర్లు వినిపిస్తున్నాయి. ఒకసారి గెలిచిన ఎమ్మెల్యేల గురించి పరిశీలిస్తే..

- కడప అసెంబ్లీ చరిత్రలోనే మహిళ ఎమ్మెల్యేగా గెలవడం ఇదే మొదటిసారి. టీడీపీ నుంచి బరిలో దిగిన ఆర్.మాధవీరెడ్డి మొట్టమొదటిగా గెలిచి చరిత్ర సృష్టించారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి సతీమణి అయిన ఈమె తక్కువ సమయంలోనే జనాల్లోకి బాగా వెళ్లారు. ఆమె ముక్కుసూటితనం, దూకుడు ప్రవర్తన టీడీపీ శ్రేణులను ఆకర్షించింది. మహిళ కావడంతో ఈమె పేరు కూడా ప్రచారంలో ఉంది.
- ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆరోసారి ఎన్నికయ్యారు. జిల్లాలో చాలా సీనియర్ ఎమ్మెల్యే ఆయన. ఇంతవరకు ఏ ప్రభుత్వంలోనూ ప్రొద్దుటూరు నుంచి మంత్రివర్గంలో ఎవ్వరికీ స్థానం లభించలేదు. సీనియర్ నేత కావడంతో ఈసారి అవకాశం ఉంటుందని ఆయన వర్గీయులు భావిస్తున్నారు.
- కమలాపురం ఎమ్మెల్యేగా పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తొలిసారి ఎన్నికల్లోనే గెలిచి సత్తా చాటారు. యువకుడు, విద్యావంతుడు కావడం, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో బాగా డీలింగ్స్ ఉండడంతో మంత్రిపదవిపై ఆయన వర్గీయులు ఆశలు పెట్టుకుని ఉన్నారు.
- మైదుకూరు ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్‌యాదవ్ మొట్టమొదటిసారిగా గెలిచారు. 2014, 2019 ఎన్నికల్లో పుట్టా సుధాకర్‌యాదవ్ ఓడిపోయారు. 2014లో టీడీపీ అధికారం చేపట్టడంతో ఈయన టీటీడీ చైర్మన్‌గా పనిచేశారు. బీసీ వర్గాని కి చెందినవారు కావడంతో ఈయన అనుచరులు మంత్రిపదవిపై ఆశలు పెట్టుకున్నారు.
- రాయచోటిలో టీడీపీ ఎమ్మెల్యేగా మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గెలుపొందారు. నియోజకవర్గం ఏర్పడిన తరువాత 1999, 2004 ఎన్నికల్లో మాత్రమే టీడీపీ నుంచి ఎస్.పాలకొండ్రాయుడు గెలిచారు. ఇక 2009 నుంచి 2019 వరకు కాంగ్రెస్, వైసీపీలే గెలుస్తూ వచ్చాయి. అయితే ఈసారి మండిపల్లి రాంప్రసాదరెడ్డి గెలిచారు. ఉమ్మడి జిల్లా అయినా ప్రస్తుతానికి అది రాయచోటి అన్నమయ్య జిల్లా హెడ్‌క్వార్టర్. మంత్రి పదవిపై ఆయన ఆశలు పెట్టుకుని ఉన్నారు.
- రైల్వేకోడూరు ఒకప్పుడు టీడీపీకి కంచుకోట. ఇక్కడ టీడీపీ నుంచి చివరిసారిగా 1999లో ఎస్.సరస్వతి గెలుపొంది అప్పటి చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. తరువాత వరుస ఎన్నికల్లో కాంగ్రెస్, వైసీపీ గెలుస్తూ వచ్చాయి. కూటమిలో భాగంగా ఈ టికెట్‌ను జనసేనకు కేటాయించారు. అరవ శ్రీధర్ గెలుపొందారు ఇది ఎస్సీ నియోజకవర్గం. ఇక రాష్ట్ర మంత్రివర్గంలో జనసేన చేరుతుంది. సామాజిక వర్గాల కూర్పు ప్రకారం మంత్రి పదవిపై ఇక్కడ జనసేన వర్గాలు ఆశలు పెట్టుకుని ఉన్నాయి.
- జమ్మలమడుగులో ఆదినారాయణరెడ్డి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచిన ఆయన తరువాత టీడీపీలో చేరి మంత్రి అయ్యారు. ఇప్పుడు బీజేపీలో ఉన్నారు. బీజేపీ కోటాలో మంత్రివర్గంలో అవకాశం ఉంటుందని ఆయన వర్గీయులు ఆశిస్తున్నారు.



పొరుగు జిల్లాలో మనోళ్లు

ప్రొద్దుటూరుకు చెందిన సత్యకుమార్ ధర్మవరం నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచారు. ఈయనకు జాతీయ స్థాయిలో బీజేపీ పెద్దలు, ఆర్ఎస్ఎస్ నాయకులతో సంబంధాలున్నాయంటారు. బీసీ వర్గానికి చెందిన నేత కావడంతో మంత్రి పదవిపై ఆయన అనుచరవర్గం ఆశలు పెట్టుకుని ఉన్నారు.

పోట్లదుర్తికి చెందిన సీఎం రమేశ్ అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా గెలుపొందారు. కేంద్ర మంత్రివర్గంలో ఈయనకు చోటు లభిస్తుందని ఈయన వర్గీయులు భావిస్తున్నారు. కేంద్రంలో ఈయనకు విస్తృత సంబంధాలు ఉన్నట్లు ప్రచారం ఉండడంతో ఈయన పేరు కూడా ప్రచారంలో ఉంది. ఇక మైదుకూరుకు చెందిన పుట్టా మహేశ్‌కుమార్‌యాదవ్ ఏలూరు నుంచి తొలిసారిగా ఎంపీగా ఎన్నికయ్యారు. ఏమో గుర్రం ఎగురుతుందేమోనన్న ఆశ ఆయన వర్గీయుల్లో ఉంది. ఇక పులివెందులకు చెందిన భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికై రాయలసీమలోని టీడీపీలో ఊపు తెచ్చారు. ఈయన కూడా మంత్రి పదవిపై ఆశతో ఉన్నారని ప్రచారం జరుగుతోంది.

ఎవరి ప్రయత్నాల్లో వారు

మంత్రివర్గంపై ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యే, ఎంపీలు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. జిల్లా నుంచి ఎన్నికైన టీడీపీ ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా ఇప్పటికే కొందరు టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌ను కలిశారు. ఇక బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ ఢిల్లీ పెద్దలను కలిసేందుకు వెళ్లారు. ఇలా ఎవరికి వారు మంత్రివర్గంలో చోటుపై ప్రయత్నాలు చేస్తుండడంతో.. ఉమ్మడి జిల్లాలో ఎవరికి పదవి దక్కుతుందోనన్న చర్చ బాగా నడుస్తోంది.

అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కట్టడాలు



అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు

- నోటీసులు జారీ చేసి పనులు ఆపేసిన పంచాయతీ అధికారులు

మదనపల్లె అర్బన్, జూన్ 8: మదనపల్లె-పుంగనూరు బైపాస్ రోడ్డులో అనుమతులు లేకుండా మూడు నెలలుగా అక్రమంగా భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం పనులు ఆపాలని వలసపల్లె పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయితే అధికారులు నోటీసులు జారీ చేసినా వాటిని పట్టించుకోకుండా శనివారం కూడా భవననిర్మాణ పనులు చేస్తుండడంతో వలసపల్లె పంచాయతీ కార్యదర్శి రవి అక్కడికి చేరుకుని పనులు నిలిపివేశారు. వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె మండలం, వలసపల్లె పంచాయతీలోని గ్రామ రెవెన్యూ సర్వేనెంబరు 547లో 2.73 ఎకరాల ప్రభుత్వ భూమిగా స్థానిక గ్రామంలోని మల్లప్ప పేరుపై ప్రభుత్వ భూమి పట్టా ఉంది. దానిపై జయపాల్ అనే వ్యక్తి తప్పుడు రికార్డులు సృష్టించి ఆ పత్రాలతో మదనపల్లెకు చెందిన మాధవ్‌రెడ్డికి అమ్మేశారు. ప్రస్తుతం మాధవ్‌రెడ్డి ఆ భూమిని కన్వర్షన్ చేయకుండా వ్యవసాయ భూమిలో గ్రామ పంచాయతీ అధికారుల అనుమతులు లేకుండా అక్రమంగా భవన నిర్మాణాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న అధికారులు వాటిని ఆపాలని నోటీసులు జారీ చేసినప్పటికీ లెక్కచేయకుండా భవన నిర్మాణాలు చేపట్టడం దారుణమని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఇలాంటి అక్రమ కట్టడాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

పీలేరు, జూన్ 8: పీలేరు మండలం ఎర్రగుంటపల్లె పంచాయతీ సర్వే నెం.784/4 పరిధిలోని అక్రమ నిర్మాణాలను అధికారులు శనివారం కూల్చివేశారు. ఆ సర్వే నెంబరులో సుమారు 90 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది వైసీపీ నాయకులు అక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వాటిపై టీడీపీ నాయకులు న్యాయపోరాటం కూడా చేయడంతో జేసీ ఫర్మాన్ అహ్మద్ సైతం వాటిని పరిశీలించి అక్రమ నిర్మాణాలుగా తేల్చారు. అయినప్పటికీ అక్కడ నిర్మాణాలు ఆగలేదు. ప్రభుత్వం మారిన వేళ టీడీపీ నాయకులు వాటి గురించి స్థానిక రెవెన్యూ అధికారులకు తెలియజేయడంతో అధికారులు శనివారం వాటిని కూల్చివేశారు.



అధికారులు కూల్చేసిన అక్రమ నిర్మాణాలు

టీడీపీ కార్యకర్తలు సంయమనం పాటించాలి

- ప్రతీకార చర్యలొద్దని కిశోర్‌కుమార్‌రెడ్డి బుజ్జగింపు



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, జూన్ 8: నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు ఎలాంటి ప్రతీకార చర్యలకు పాల్పడకుండా సంయమనం పాటించాలని నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లపాటు అరాచకాలకు, అకృత్యాలకు పాల్పడిన వైసీపీకి గుణపాఠం చెబుతూ టీడీపీకి ప్రజలు భారీ మెజారిటీ ఇచ్చారని ఆయన చెప్పారు. శనివారం నగరిపల్లెలో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను కలుసుకున్నారు. ఇతర నియోజకవర్గాల నుంచి కూడా పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలు ఎదుర్కొన్న వేధింపులన్నీ తనకు పూర్తిగా తెలుసన్నారు. వాటన్నిటికీ జవాబు చెప్పే కాలం దగ్గరే ఉందని, అందుకు అనుసరించాల్సిన మార్గాలు వేరుగా ఉంటాయని ఆయన చెప్పారు. వచ్చిన వారంతా తాము ఎదుర్కొన్న వేధింపుల గురించి ఏకరువు పెడుతుండగా వాటన్నిటినీ ఆయన సానుకూలంగా విన్నారు. ప్రతి కార్యకర్తకు, నాయకుడికీ జరిగిన అన్యాయాలు, వేధింపుల జాబితా తన దగ్గరుందని, ప్రతి బాధితుడికీ న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఐదేళ్లు భరించిన మనం కొద్ది రోజులు మాత్రం ఓపిక పట్టాలని చెప్పారు. ప్రతీకారాలు, అరాచకాలు, వేధింపులు ఒక్కటే మార్గం కాదని గుర్తించాలని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాత్రి పొద్దుపోయే వరకూ నగరిపల్లెలో బారులుదీరారు. వచ్చిన వారందరినీ కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి తనూజా రెడ్డి సాదరంగా పలకరించి ఎన్నికల్లో కష్టపడి పనిచేసి భారీ మెజారిటీ సాధించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపు కార్యకర్తల కష్టారితమని ఆమె పేర్కొన్నారు. అన్ని మండలాల నుంచి మహిళా నాయకురాళ్లు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గాలివీడులో రామోజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు



రాజంపేట: రామోజీరావుకు నివాళులర్పిస్తున్న సుబ్బనరసయ్యనాయుడు తదితరులు



రాయచోటి: టీడీపీ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న మండిపల్లి అనుచరులు



రైల్వే కోడూరు: రామోజీరావుకు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

రామోజీరావుకు ఘన నివాళి

గాలివీడు, జూన్ 8: పత్రికా రంగంలో నూతన ఒరవడిని సృష్టించిన ఘనత రామోజీరావుదేనని మాజీ సర్పంచులు మహమ్మద్‌రియాజ్, బసవరాజు శ్రీనివాస్‌రాజు అన్నారు. గాలివీడులోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నాయకులు రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రిక, టీవీ ద్వారా ఎంతో మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ప్రభుత్వాల లోపభూయిష్ట విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేశారని కొనియాడారు. రామోజీ ఫిలిం సిటీని స్థాపించి ప్రపంచ పర్యాటకులను ఆకర్షింపజేశారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వీరరాఘవులు, శ్రీకాంత్, చెన్నయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు జగన్‌మోహన్ రాజు ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్ర పటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు పత్రికా రంగంలో రామోజీరావు మకుటంలేని మహారాజని, పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టించారని అన్నారు. ఆయన మృతి రాష్ట్రప్రజలకు , మీడియా, సినీ, పారిశ్రామిక రగానికి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్రమణ్యంనాయుడు, పట్టణ అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రమణ్యం నాయుడు, బీజేపీ నాయకులు రాజు, టీఎన్ఎస్ ఎఫ్ అధ్యక్షులు పోలి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. రాజంపేట గీతాంజలి విద్యాలయాల ప్రాంగణంలో ఆ విద్యాసంస్థల అధినేత ఎస్ వి రమణ ఆధ్వర్యంలో రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం రామోజీరావు చిత్ర పటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రమణ్యం, లీగల్ సెల్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఆర్టీసీ మాజీ చైర్మన్ యొద్దల సుబ్బరాయుడు, రాష్ట్ర టీడీపీ సంయుక్త కార్యదర్శి సుధాకర్, మాజీ మండల ఉపాధ్యక్షులు నాగాసుధాకర్‌రెడ్డి, మహిళా నాయకురాలు కొల్లా త్రివేణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పత్రికారంగానికి రామోజీరావు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. టీడీపీ కార్యాలయంలో మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు నివాళులర్పించారుపట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, పార్లమెంటు అధికార ప్రతినిధి ప్రతాప్‌రాజు ఎంపీటీసీ సురేష్, పెంచలయ్య, సాంబశివయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె: రామోజీరావు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనమని టీడీపీ నాయకులు తెలిపారు. శనివారం ఉదయం తెల్లవారుజామున ఈనాడు సంస్థల అధినేత మృతిపై సుండుపల్లె టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. సామాన్య కుటుంబంలో జన్మించి దేశంలోనే అత్యున్నత స్థానానికి ఎదిగిన వ్యక్తి, అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని నిరూపించిన మహనీయుడన్నారు. నిజాన్ని నిర్భయంగా రాస్తూ ప్రజలకు అధికారులకు, ప్రభుత్వాలకు వారధిగా పనిచేయడం సామాన్యమైన విషయం కాదని వారు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, శివరామ్‌నాయుడు, మాలేపాటి సురేశ్‌నాయుడు, గ్రామ అధ్యక్షుడు సుబ్బరామ్, ఎల్వీ రమణ తదితరులు పాల్గన్నారు.

రాయచోటిటౌన్: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి పట్ల ఆదివారం రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి అనుచరులు సంతానం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయన మృతి రాష్ట్రానికి కాకుండా దేశానికి కూడా తీరని లోటన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): ఈనాడు గ్రూప్స్ అధినేత రామోజీరావు ఆకస్మిక మరణం పత్రికా లోకానికి తీరని లోటని టీడీపీ నాయకులు కోడూరు మాజీ ఉపసర్పంచ్ నార్జాల హేమరాజ్, వార్డు సభ్యుడు పోతురాజు నవీన్, మైనారిటీ సీనియర్ నేత పటాన్ మౌలా తెలిపారు. శనివారం మండలంలోని రాఘవరాజుపురంలోని పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రిక రంగంలో రామోజీరావు చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండల అధ్యక్షుడు కొమ్మ శివ, సిద్ధేశ్వర, లాల్‌బాషా, వార్డు మాజీ సభ్యుడు సుదర్శన్ పాల్గొన్నారు. మాజీ ఉపసర్పంచ్ నార్జాల హేమరాజ్, యువ నాయకులు వార్డు సభ్యులు పోతురాజు నవీన్, మైనారిటీ సీనియర్ నాయకుడు పటాన్ మౌలా రాఘవరాజుపురంలోని టీడీపీ కార్యాలయంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కొమ్మ శివ, సిద్ధేశ్వర, లాల్‌బాషా, మాజీ వార్డు సభ్యుడు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నందలూరు: అరవపల్లె ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచు జంబు సూర్యనారాయణ నివాళులర్పించారు. నాయకులు సయ్యద్ అమీర్, మోడపోతుల రాము, మౌలా, దండు నాగేశ్వరరావు, నాగేంద్ర, తుమ్మాది శివ, బీజేపీ నాయకులు పోతురాజు మస్తానయ్య, హిమగిరినాథ్‌యాదవ్, చిన్నరాయలు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: చిట్వేలిలో టీడీపీ మాజీ అధ్యక్షుడు లారీ సుబ్బరాయుడు, సీనియర్ నాయకులు బాలు రామాంజనేయులు, నరసింహులు నివాళులర్పించారు. నాగార్జున, బాలు రెడ్డయ్య, దినేష్, మధు, కోటి, నకుల్, హరి, వెంకటేశ్వర, చందు, దినేష్, సుబ్బరాయుడు, తిమ్మయ్యగారిపల్లె గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌ఛార్జ్ ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో ముక్కావారిపల్లెలో వరలక్ష్మి, ముక్క సాయివికాస్‌రెడ్డి నివాళుల ర్పించారు. కల్లా చలపతి, పున్నాటి వాసుదేవరెడ్డి, అనుముల గుండం చంద్రమోహన్, విశ్వనాథ్‌రెడ్డి, సుబ్బరాయుడు, శంకర్‌రెడ్డి, మధురెడ్డి, జగదీష్, రవి, సుధాకర్, కిరణ్, మహేష్, చెంగల్‌రెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. కమ్మపల్లెలో పయ్యావుల కోటేశ్వరరావు, రవీంద్రనాయుడు, నాగేంద్రనాయుడు, కృష్ణయ్య నాయుడు, రమణ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం: మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించి అమర్‌రహే రామోజీరావు అంటూ నినదించారు.

లక్కిరెడ్డిపల్లి: ఎంపీటీసీ మాజీ సభ్యుడు మదనమోహన్, మైనార్టీ యువ నాయకుడు ఆరిఫుల్లా అధ్వర్యంలో నివాళులర్పించారు. రాజంపేట పార్లమెంట్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు సీపీ శ్రీనివాసులు, వెంకటరామరాజు, మల్లికార్జున, సంజీవ్‌బాబు, హేమంత్, సంతోష్, గిరీష్, అమీర్ హజరత్ తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి: మండల టీడీపీ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, నాయకుడు రెడ్డెప్పరెడ్డి మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంతో సంతాపం తెలియజేసి, నివాళులు అర్పించారు. టీడీపీ నాయకులు రాంమోహన్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, మట్లి సర్పంచ్ నాగార్జునాచారి, దుర్గం ఆంజనేయులు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనగలూరు : మండల టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన నాయకులు నివాళులర్పించారు. కోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ఆదేశానుసారం టీడీపీ , జనసేన మండల నాయకులు, కార్యకర్తలు కార్యాలయానికి చేరుకుని రామోజీరావు చిత్ర పటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, కమ్మ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి నరేష్‌నాయుడు (బాబు) పార్మమెంటు క్లస్టర్ ఉపాధ్యక్షులు ఎన్. రాంప్రసాద్ నాయుడు,జిల్లా, మండల నాయకులు కొప్పోలు విజయభాస్కర్‌రెడ్డి, ఊటుకూరు పాలిరెడ్డి, జేసి సుబ్బయ్య, జి.రామయ్య, జి.హరి, ముదిరాజ్ సంఘం పార్లమెంటు అధ్యక్షులుయానాదయ్య, తోట పిచ్చయ్య, రామసుబ్బయ్య, రాష్ట్రకార్యదర్శి ధనుంజయనాయుడు, హరిప్రసాద్‌రెడ్డి, కమతం జయరామయ్య, జనార్దన్‌రెడ్డి, గంగయ్యయాదవ్, వెంకటేష్, కె.హరి, కోడూరు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని టీడీపీ నాయకులు అన్నారు. శనివారం పుల్లంపేటలోని టీడీపీ కార్యాలయంలో, రెడ్డిపల్లెలో రామోజీరావు చిత్ర పటానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ నరసింహులు,సురేంద్రరెడ్డి , వెంకటసుబ్బయ్య, శివయ్య, మహేష్, రంగయ్యనాయుడు, సుబ్రమణ్యం తదితరలు పాల్గొన్నారు.

రాజంపేట: రామోజీరావు మృతి తీరని లోటని ఆ సంస్థలో 1988 నుంచి రాజంపేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు పని చేసిన, చేస్తున్న ఉద్యోగులు, విలేఖర్లు అన్నారు. రాజంపేటలో శనివారం వారు ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మలిశెట్టి సుబ్బనరసింహులు, గుండ్రాతి విజయ్‌కుమార్, కొత్తపల్లె గణేష్‌బాబు, గంగనపల్లె వెంకటరమణ, కోలా నరసింహులు, చల్లా సుధాకర్, ప్రభాకర్‌నాయుడు, ప్రస్తుతం పనిచేస్తున్న పాత్రికేయులు కె.వీరాచారి కొత్తపల్లె చంద్ర, సుభాష్, బోయనపల్లె ఏజెంటు మునెయ్య, రాజంపేట ఏజెంట్లు చంద్రయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : పత్రికా ప్రపంచానికే నిలువెత్తు నిదర్శనం రామోజీరావు అని మండలంలోని టీడీపీ నాయకులు అన్నారు. శనివారం టీడీపీ నాయకులు రామోజీరావు చిత్ర పటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గజ్జల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, కాంట్రాక్టర్ రమణ, లక్ష్మిరెడ్డి, వీరాంజనేయరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నందలూరు: రామోజీరావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఓబులవారిపల్లె: రామోజీరావు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు



వీరబల్లి: రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు



రామోజీరావు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

గురిగింజకుంట మాజీ సర్పంచ్ శెట్టిపల్లి సుభద్రమ్మ మృతి



సుభద్రమ్మ భౌతిక కాయం

సంబేపల్లె, జూన్ 8: మండల పరిధిలోని గురిగింజకుంట గ్రామం దిన్నెపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ శెట్టిపల్లి సుభద్రమ్మ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈమె కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. ఆమె 2001 నుంచి 2005 వరకు గురిగింజకుంట సర్పంచ్‌గా పనిచేశారు. మాజీ సర్పంచ్ మృతి చెందిన విషయం తెలుసుకుని పలు గ్రామాల ప్రజలు మృతదేహాన్ని చూసేందుకు తరలివచ్చారు. సాయంత్రం ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

లక్కిరెడ్డి పల్లె, జూన్8: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇల్లు దగ్ధమైంది. బాధితుడి కథనం మేరకు దిన్నెపాడు గ్రామం బెస్తపల్లి హరిజనవాడకు చెందిన మద్దిరేవుల ఓబులేసు ఇంట్లోని బెడ్‌రూంలో శనివారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. విషయం గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అయితే, వారు వచ్చే లోగానే మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో దాదాపు 5 లక్షల మేరకు ఆస్తినష్టం సంభవించినట్లు ఓబులేసు వాపోయాడు. ఈ ప్రమాదంలో వేరుశనగ విత్తనాలతోపాటు, బంగారు నగలు, నగదు, ఇంట్లోని సామగ్రి మొత్తం కాలిపోయినట్లు వివరించాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

ఫైబర్ నెట్‌లో ఏబీఎన్ ప్రసారాల పునరుద్ధరణ

కలికిరి, జూన్ 8: ప్రభుత్వ ఫైబర్ నెట్ కేబుల్ సర్వీసు ద్వారా ఏబీఎన్ ప్రసారాలను ప్రభుత్వం పునరుద్ధరించింది. కోర్టులు ఆదేశించినా, నియంత్రిత సంస్థలు చొరవ తీసుకున్నా ఖాతరు చేయకుండా ఐదేళ్ళ నుంచి జగన్ ప్రభుత్వం ఏబీఎన్ ప్రసారాలు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఏబీఎన్‌తోపాటు ఈటీవీ, టీవీ5 న్యూస్ చానెళ్ళను ప్రసారం చేయకుండా కూడా ప్రభుత్వ అడ్డుకుంది. అయితే ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం శుక్రవారం నుంచి ప్రసారాలను స్వచ్ఛందంగా పునరుద్ధరించారు. కొత్త ప్రభుత్వం ఇంకా కొలువుదీరకున్నా అధికారులు చొరవ తీసుకుని తప్పును సరిదిద్దుకున్నారు. కొత్త ప్రభుత్వం బాధ్యతలు తీసుకుంటే ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనన్న ఆందోళనతో అధికారులే ఏకపక్షంగా ప్రసారాలను పునరిద్ధరించారని చెపుతున్నారు. ఏబీఎన్ ప్రసారాలు 55వ చానెల్‌లో ప్రసారమవుతున్నట్లు చెబుతున్నారు

అధినేతకు అంతా తెలుసు!

● టీడీపీ పరాజయంపై సుగవాసి ● రాజంపేటను జిల్లా కేంద్రం చేసి తీరుతాం ● ఇకపై ఇక్కడే స్థిర నివాసం

రాజంపేట, జూన్ 7: నియోజక వర్గంలో టీడీపీ ఓటమికి ఎవరు కారకులో పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుకు బాగా తెలుసని, ఎన్నికల ముందే ఈ విషయాన్ని పరిశీలించి, ముందస్తు హెచ్చరికలు జారీ చేశారని, తాను ఏమీ చెప్పాల్సిన అవసరం లేదని రాజంపేట టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. రాజంపేటలో శనివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను నెల రోజుల ముందే రాజంపేటకు వచ్చానని, కార్యకర్తలు నిజాయితీగా ఎంతో కష్టపడి పని చేసినా, కొన్ని అజ్ఞాత శక్తులు తమ ఓటమికి కారణమయ్యాయన్నారు. ఎవరిపై నిందారోపణలు చేయడం తనకు చేతకాదన్నారు. విజయం అంచుల వరకు తీసుకువచ్చిన రాజంపేట నియోజక వర్గ కార్యకర్తల రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని ప్రకటన చేసిన విషయాన్ని అధినేతకు గుర్తు చేసి సాధిస్తానన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యే స్థానాలు పెరుగుతున్న దృష్ట్యా, జిల్లా కేంద్రంపై స్పష్టమైన ప్రకటన చేశామన్నారు. అన్నమయ్య ప్రాజెక్టును పునరుద్ధరించి, బాధితులకు న్యాయం చేస్తామని, మెడికల్ కళాశాలను కూడా తెప్పిస్తామన్నారు. ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానం ఖాళీ కాబోతొందని, ఆ స్థానాన్ని కూడా కైవసం చేసుకుంటామన్నారు. స్థానిక సంస్థలలో అన్ని స్థానాల్లో టీడీపీ విజయఢంకా మోగించడానికి, నాయకులందరికీ పదవులు రావడానికి ఇప్పటి నుంచి పాటుపడతా నన్నారు. నియోజకవర్గ బాధ్యుడిగా కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తా_మన్నారు. రాజంపేట నియోజక వర్గ టీడీపీ పరిశీలకుడు దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ ఓటమిని విజయసోపానంగా భావించి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందన్నారు. ఆర్టీసీ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, జిల్లా లీగల్ అధ్యక్షుడు టి.లక్ష్మీ నారాయణ, గీతాంజలి అధినేత ఎస్‌వి రమణ, మైనార్టీ నాయకులు గుల్జార్‌బాషా, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్ కుమార్‌రాజు సీనియర్ న్యాయవాది కృష్ణకుమార్, మండల మాజీ ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, టీడీపీ మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి, మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు మణి, మైనార్టీ నాయకులు అబూబకర్, తదితరులు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ అబివృద్ధికి, పనులకు శ్రీకారం చుట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఆర్టీసీ మాజీ చైర్మన్ యొద్దల సుబ్బరాయుడు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి అధినేత ఎస్‌వి రమణ, మైనార్టీ నాయకులు గుల్జార్‌బాషా, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు సీనియర్ న్యాయవాది కృష్ణకుమార్, మాజీ మండల ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, టీడీపీ మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి మండల పార్టీ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పట్టణ అధ్యక్షులు మణి, మైనార్టీ నాయకులు అబూబకర్, తదితరులు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ అబివృద్ధికి, పనులకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. కావటూరి సుబ్రమణ్యంనాయుడు (మణి) ఆదినారాయణ, పార్లమెంటు ఉపాధ్యక్షురాలు వాణి, పట్టణ మాజీ టీడీపీ అధ్యక్షులు సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం

విజ్ఞానాన్ని అందించేవే గ్రంథాలయాలు

పుల్లంపేట,జూన్ 8 : విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాల యాలను అభివృద్ధి చేసుకోవాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిణి భారతీదేవి అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా సర్పంచు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కథలు, చిత్ర లేఖనం, ఇంగ్లీషులో పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ సుబ్బరాజు, అసిస్టెంటు ప్రకాష్ పాల్గొన్నారు.



బహుమతులు పంపిణీ చేస్తున్న సర్పంచు

శాంతియుతంగా పనులు చేసుకోవాలి

ఒంటిమిట్ట, జూన్ 8 : మండలంలోని అన్ని గ్రామాల్లో శాంతీయుతంగా తమ పనులు చేసుకోవాలని ఇన్‌చార్జి డీఎస్‌పి రమాకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ప్రజలతో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో కలిసి మెలసి వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

మోపిదేవి సుబ్రహ్మణ్య స్వామి సన్నిధిలో ముక్కా



ఆలయంలో ముక్కా కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, జూన్ 8: అవనిగడ్డ మోపిదేవి సుబ్రహ్మణ్యా స్వామిని శనివారం రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి కుటుంబంతో పాటు జనసేన రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ దర్శించుకుని పూజలలు చేశారు. ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముక్కా విశాల్‌రెడ్డి, ముక్కా సాయివికాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచాలమ్మకు అభిషేకం, పూజలు

సుండుపల్లె, జూన్ 8: మంచాలమ్మ తిరుణాల సందర్భంగా జి.రెడ్డివారిపల్లెలో ఆదివారం గ్రామస్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని అలంకరించి తిరుణాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రాత్రికి చాందినీ బండ్ల దర్శనం ఇవ్వనున్నాయి. సుండుపల్లె పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొననున్నారు.

నారా లోకేశ్‌ను కలసిన మండిపల్లి

రాయచోటిటౌన్, జూన్ 8: టీడీపీ జాతీయ కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ బాబును శుక్రవారం రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంగళగిరిలో మర్యాద పూర్వకంగా కలిసి బొకే ఇచ్చి, శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండిపల్లి మాట్లాడుతూ రాయచోటి అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని, పేదల నుంచి లాక్కున్న భూములపై విచారణ జరిపించి తిరిగి ఆ భూములను పేదలకు చెందేలాగా చూడాలని కోరారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులపై బనాయించి న అక్రమ కేసులనుక తొలగించాలని కోరారు. దీనికి లోకేశ్‌బాబు స్పందిస్తూ మును పెన్నడూ లేని విధంగా రాయచోటిన అభివృద్ధి చేసి చూపిస్తామని, భూములు, కార్యకర్తల విషయంలో కూడా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



టీడీపీ జాతీయ కార్యదర్శి నారాలోకేశ్‌తో మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

కనకదుర్గమ్మకు పూజలు..

విజయవాడ కనకదుర్గమ్మను రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి పూజల అనంతరం ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు. టీడీపీ నాయకులు, మండిపల్లి అభిమానులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు

సుండుపల్లె, జూన్ 8: టీడీపీ విజయం సాధించడంతో ఆ పార్టీ మండల నాయకుడు అమ్మనాయక్ ఆధ్వర్యంలో ముడుంపాడు పంచాయతీ ఆరోగ్యపురంలోని ప్రసన్నవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయబోతున్న సందర్భంతోపాటు రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి అరాచక పాలన అంతం కావడంతో ఈకార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ నాయకులు ఆనంద్‌నాయక్, సీనియర్ నాయకులు చంద్రమోహన్, చిన్నసిద్దు, జనార్దన, జయరాంనాయక్ పాల్గొన్నారు.



టెంకాయలు కొడుతున్న టీడీపీ నేతలు

గండికి టీడీపీ నేతల పాదయాత్ర

సిద్దవటం, జూన్ 8 : మండలంలోని భాకరాపేట ఎల్లమ్మ అమ్మవారికి రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు పుత్త రామచంద్రయ్య ఆధ్వర్యంలో టీడీపీ నేతలు కాయ కర్పూరం సమర్పించి గండికి పాదయాత్ర ప్రారంభించారు. నేతలు బాలిశెట్టి హరి ప్రసాద్, కుప్పాల వెంకటసుబ్బయ్య, ఒంటిమిట్టకు చెందిన ఆలూరి వెంకటసుబ్బయ్య ఊరు చివర వరకు వచ్చి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పుత్తా రామచంద్రయ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ విజయం సాధించడంతో ఆంజనేయ స్వామికి మొక్కు చెల్లించుకు నేందుకు గండి క్షేత్రానికి కాలినడకన బయలు దేరుతున్నామని,తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గండి క్షేత్రానికి కాలి నడకన వెళ్తున్న టీడీపీ నాయకులు

వేంకటేశ్వరాలయంలో పూజలు

గాలివీడు, జూన్ 8: పెద్దూరు బ్రాహ్మణ వీధి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు ఆనంద్ ఆచార్యులు ఆధ్వర్యంలో శ్రీకాంత్‌రెడ్డి దంపతులతో స్వామి వారికి విశేష అలంకరణ, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి విజయం సాధించడంతో పాటు రాష్ట్రంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేడెం లక్ష్మయ్య, టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సుబ్బారెడ్డి, చెన్నయ్య, గుణ తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

మస్తాన్‌వలి దర్గాలో ప్రార్థనలు

రామాపురం, జూన్8: మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గెలుపొందాలన్న తమ కోరిక నెరవేరడంతో రాచపల్లె పంచాయతీ గంగనేరులోని మస్తాన్‌వలి దర్గాలో మండల తెలుగు యువత సెక్రటరీ షేక్. ఖాసీంపీరా, కార్యకర్తలు, అభిమానులు ప్రార్థనలు చేశారు. నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు గండి ఆంజనేయస్వామి సన్నిధిలో 101 టెంకాయలు కొట్టి మొక్కులను చెల్లించుకున్నారు.



గంగనేరు క్వార్టర్స్‌లోని మస్తాన్‌వలి దర్గాలో టెంకాయలు కొడుతున్న టీడీపీ శ్రేణులు

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు అలీఅహ్మద్

రాయచోటి టౌన్, జూన్8: ఈ నెల జూన్ 13, 14వ తేదీల్లో జమ్మూలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు తాను ఎంపికైనట్లు రాయచోటి పట్టణానికి చెందిన షేక్. షబ్బీర్ కుమారుడు షేక్. అలీఅహ్మద్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూత్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కోచ్ నంద వెంకటేశ్వరగౌడ్ ఆధ్వర్యంలో పాల్గొంటున్నానని చెప్పారు.



రేణుకా యల్లమ్మ సన్నిధిలో అన్నదానం

పెనగలూరు, జూన్ 8 : మండల కేంద్రంలోని రేణుకా యల్లమ్మ దేవాలయం ప్రాంగణంలో శనివారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.. ప్రతియేడు వేణు గోపాలస్వామి బ్రహ్మోత్సవాల కంటే ముందు గ్రామదేవత రేణుకా యల్లమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీ... ఈ సందర్భంగా సాయంత్రం జిలకర చిన్నసుబ్బయ్య కుటుంబం నుంచి మేకపోతు, కలివెల గంగాధరమ్మ కుటుంబం నుంచి దున్నపోతును ఊరేగింపుగా దేవాలయం వద్దకు తీసుకు వచ్చారు. గౌనేని కృష్ణయ్య నాయుడు కుటుంబసభ్యులు అమ్మవారికి పట్టుచీర, పూజా సామగ్రిని మేళతాళాలతో తీసుకు వచ్చారు. కోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి 30 వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య స్వామి తెలిపారు. ఆదివారం రాత్రికి ఆసాది కథ, తెల్లవారుజామున అమ్మవారి కి జంతు బలులు సమర్పించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.



రేణుకాయల్లమ్మ దేవాలయంలో అన్నదానం చేస్తున్న గ్రామ పెద్దలు

నిరుపేద వికలాంగుడికి నిత్యావసర సరుకుల వితరణ

రాజంపేట టౌన్, జూన్ 8 : మండల పరిధిలోని వరదయ్యగారిపల్లెలో నివసిస్తున్న పందేపాటి నరసింహులకు పసుపులేటి సరస్వతమ్మ మెమోరియల్ ఫౌండేషన్ ట్రస్టు చైర్మన్ ప్రవీణ్ కుమార్ ఆదేశాలతో మెంబర్ పసుపులేటి వినోద్‌కుమార్ శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసింహులు గత కొన్నేళ్లుగా నడవలేని పరిస్థితుల్లో వున్నాడని, కుటుంబ పోషణ కష్టంగా ఉండటం తెలుసుకుని సహాయంగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్, నాగేంద్ర, వినోద్ సంతోష్, విశ్వనాథ్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



నరసింహులుకు సరుకులు అందిస్తున్న వినోద్

నేటి నుంచి రామాపురంలో మహాభారత యజ్ఞం

రామాపురం, జూన్ 8: మండల కేంద్రంలో మహాభారత యజ్ఞాన్ని నిర్వహించేందుకు శనివారం అంకురార్పణ చేశారు. పంచపాండవులు, ద్రౌపదీమాత, పోతులరాజు ప్రతిమలను గ్రామాల్లో ఊరేగించారు. మహాబారత యజ్ఞ కమిటీ సభ్యుడు మద్దిరేవుల రమేశ్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ అయోధ్యాపురం నాగభూషణ్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు పెద్దిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, భక్తవత్సలంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి, నారాయణ తదితరులు ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ మహాభారత యజ్ఞం జరుగుతున్న రోజులు మధ్యాహ్నం అన్నదానం చేయనున్నారు.

తప్పిన ప్రమాదం




దెబ్బతిన్న ఎమర్జెన్సీ రికవరీ వెహికల్ - రోడ్డు పక్కకు దూసుకెళ్లి ఆగిన ట్యాంకర్

రైల్వేకోడూరు, జూన్ 8: మాధవరంపోడు ప్రధానదారిపై శనివారం ట్యాంకర్ ఎమర్జెన్సీ రికవరీ వెహికల్‌ను ఢీకొంది. స్థానికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ట్యాంకర్ రైల్వేకోడూరు నుంచి కడప వైపు వెళుతుండగా ఎదురుగా ఎమర్జెన్సీ రికవరీ వాహనం వస్తోంది. ఐతే ట్యాంకర్ అదుపు తప్పి ఎమర్జెన్సీ రికవరీ వాహనాన్ని ఢీకొంది. అందులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. ఢీకొన్న ట్యాంకర్ కంపచెట్లలోకి వెళ్లి ఆగిపోవడంతో ప్రమాదం తప్పింది. పోలీసులు విచారిస్తున్నారు.

గండికి భారీగా భక్తులు



గండిలో క్యూలో నిల్చున్న భక్తులు

చక్రాయపేట, జూన్ 8: గండి దేవస్థానంలో శనివారం భక్తులు భారీగా వచ్చారు. ఉదయం 9గంటల నుంచి రెండు గంటల వరకు భక్తులు క్యూలో నిలబడి అంజన్నను దర్శించుకున్నారు. రెండో శనివారం కావడం, సెలవులు ఉండడంతో గండికి భారీగా భక్తులు చేరుకుని అంజన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు. ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్ స్వామివారికి తోమాలలు అలంకరించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సర్వదర్శనం, స్పెషల్ దర్శనం, వీఐపీ దర్శనాలు ఈ వారం ఎక్కువగా ఆకుపూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులు తమ వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు.

దొంగలు పడ్డారు - ఇసుకను దోచుకెళ్లారు



పగడాలపల్లె సమీపంలో ఉన్న ఇసుక డంపు

పెండ్లిమర్రి, జూన్ 8: సాధారణంగా ఇళ్లు, గుళ్లు, దుకాణాలు, చివరికి ప్రభుత్వ ఆఫీసుల్లో సైతం దొంగలు చోరీలు చేసేది చూశాము. ప్రస్తుతం ఇసుకను దోచుకెళ్లారని పలువురు బహిరంగంగా చెబుతూ ఎగతాళి చేస్తున్నారు. పెండ్లిమర్రి మండలంలో జరిగిన ఇసుకను దోచుకెళ్లిన సంఘటనలోకెళితే...

వర్షాలు కురిసి నదుల్లోకి నీళ్లు వస్తే ఇసుక తవ్వకాలు జరపడం కష్టంగా ఉంటుందని, భవన నిర్మాణ రంగాలు, ప్రజల గృహ నిర్మాణాల అవసరాల కోసం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల కోసం పనులు ఆగిపోకుండా ఉండేందుకు ముందుగానే ఇసుకను డంపుల రూపంలో నిల్వచేస్తారు. అవసరాన్ని బట్టి అక్కడి నుంచి ఇసుకను తరలిస్తారు. ఇందులో భాగంగా నదీపరివాహక ప్రాంతాల్లో కొన్నిచోట్ల డంపులు చేశారు. ఎక్కడైన దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు, డబ్బు దోచుకోవడంచూశాం. ఇసుక డంపుల్లో దొంగలు పడి ఇసుకను తీసుకెళ్లడం పెండ్లిమర్రి మండలంలోనే చూస్తున్నాం. ఈ ఇసుక డంపులే అక్రమ రవాణదారులకు కల్ప తరువుగా మారింది. మండలంలో పాపాఘ్ని నదినుంచి ఇసుక తవ్వకాలు జరిపి పగడాలపల్లె, కొత్తగంగిరెడ్డిపల్లె, ఉలవలపల్లె గ్రామాల పరిధిలో ఇసుకను డంపింగ్ చేశారు. ఇపుడు పగడాలపల్లె సమీప డంపులో ఇసుక అక్రమ రవాణాదారులు రాత్రివేళ ఎక్స్‌కవేటర్లను పెట్టి టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం మండలంలో డంపుల నుంచి రాత్రి వేళ టిప్పర్ల ద్వారా ఇసుక తరలించడం హాట్ టాపిక్‌గా మారింది.

రైలు మార్గం పూర్తయ్యేనా : తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 8: కడప-రాయచోటి-మదనపల్లె-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గాన్ని ఇకనైనా పూర్తిచేయాలని కాంగ్రెస్ రాష్ట్రమీడియా చైర్మన్ తులసిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. శనివారం వేంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ సర్వతోముఖాభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో కడప-రాయచోటి-మదనపల్లె-బెంగుళూరు కొత్త బ్రాడ్‌గేజ్ రైలు మార్గాన్ని మంజూరు చేసిందన్నారు. 2010లో కేంద్ర రైల్వే మంత్రి మునియప్ప శంకుస్థాపన చేశారన్నారు. కడప నుంచి పెండ్లిమర్రి వరకు రైల్వేలైన్ పూర్తయిందన్నారు. కానీ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయలేదన్నారు. దీనికి తోడు ఈ రైలు మార్గాన్ని రద్దు చేయమని జగన్ 17.6.2021న రైల్వే శాఖకు లేఖ రాశారన్నారు. దీంతో పనులు ఆగిపోయాయన్నారు. కావున చంద్రబాబు ప్రభుత్వం వెంటనే రాష్ట్ర వాటాగా చెల్లించాల్సిన నిధులు విడుదల చేయాలని పనులు తిరిగి ప్రారంభింపజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రామాలయ నిర్మాణంలోనూ....

రాజకీయ గ్రహణం

ఊరంతా ఒక మాట ఆ ముగ్గురిదీ ఒక మాట ● అసంపూర్తిగా జిల్లెల్ల రామాలయ నిర్మాణం



అసంపూర్తిగా ఉన్న రామాలయాన్ని పూర్తి చేయాలని చూపుతున్న గ్రామస్తులు

పోరుమామిళ్ల, జూన్ 8: ఎక్కడైనా దేవాలయ నిర్మాణాలు చేపట్టాలన్నా కమిటీలు తప్పనిసరిగా ఉండాలి. అందులో వారు భాగస్వాములైతే టీటీడీ కూడా ఆ నిర్మాణానికి అదనపు నిధులు మంజూరు చేస్తారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓ వైసీపీ నేత మాట విని ఊరంతా తీసుకున్న చోట కాకుండా ముగ్గురు మాత్రమే తమ సొంత పొలంలో నిర్మించుకున్న ప్రాంతంలో బేస్‌మెంట్ వేసుకుంటే ఆ ముగ్గురి మాట విని అక్కడ జియో ట్యాగ్ చేశారు అధికారులు. అసలు విషయానికొస్తే పోరుమామిళ్ల మండలం అక్కలరెడ్డిపల్లె జిల్లెల్ల గ్రామంలో రామాలయంలో దేవదాయ ధర్మదాయ శాఖ తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో మంజూరైంది. అయితే తమ గ్రామంలో పురాతనం నుంచీ గ్రామ నడిబొడ్డున పాత రామాలయం ఉందని, అది అసంపూర్తిగా ఉండడంతో ప్రజల విన్నపంతో దేవాలయ నిర్మాణం కోసం రూ.8.50 లక్షలు నిధుల మంజూరు చేశారని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో నిర్మించే గుడికి నిధులు మంజూరైతే ఆ గ్రామంలోని వ్యక్తి తన ఇంటి వద్ద ఉన్న పొలంలో నిర్మించుకున్నందుకు రాజకీయంగా ప్రయత్నాలు చేసి నిర్మాణం మొదలు పెట్టారన్నారు. కానీ గ్రామ పెద్దలు మొత్తం కూడా దీన్ని వ్యతిరేకించడంతో దేవదాయశాఖ వారు రాజకీయ వత్తిళ్లతో ప్రజలు నిర్మించుకున్న గుడి కాదని మరొకరి పొలంలో నిర్మించే గుడికి మంజూరు చేసేందుకు ప్రయత్నించారని గ్రామ ప్రజలు తెలిపారు. గ్రామంలో ఎవరూ లేని సమయంలో రాజకీయ వత్తిళ్ల కారణంగా నిధులు మంజూరు చేసేందుకు జియో ట్యాగ్ చేశారన్నారు. కావున గ్రామనడిబొడ్డున ప్రజల కోసం నిర్మాణంలో ఉన్న రామాలయ నిర్మాణం పూర్తికి దేవదాయశాఖ అధికారులు, జిల్లా అసిస్టెంటు కమిషన్ వారు పూర్తిగా విచారణ జరిపి గ్రామస్తులకు న్యాయం చేయాలని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై దేవదాయశాఖ వర్క్ ఇన్‌స్పెక్టరు చరణ్‌ను పాత్రికేయులు వివరణ కోరగా, ఆ గ్రామానికి దేవాలయం మంజూరైన విషయం వాస్తవమేనని, తాను వెళ్లినప్పుడు ముగ్గురు నిర్మాణం చూపి ఇక్కడే రామాలయం నిర్మిస్తామని చెప్పడంతో దాన్ని జియోట్యాగ్ చేశామన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

నామినేటెడ్ పదవులకు రాజీనామా

జమ్మలమడుగు, జూన్ 8: జమ్మలమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కమిటీ చైర్‌పర్సన్లు, మెంబర్లు సంబంధిత అధికారులకు రాజీనామాలు సమర్పించారు. డివిజన్ సహకార శాఖ అధికారి ప్రొద్దుటూరు డివిజన్ కార్యాలయంలో, జమ్మలమడుగు సబ్‌డివిజన్ అధికారి కార్యాలయంలో సంబంధిత మండల సీఈఓలకు శనివారం రాజీనామాలు సమర్పించినట్లు జమ్మలమడుగు, పెద్దముడియం మండలాల సీఈఓలు మాబూసాని, బాలాంజనేయులు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు జమ్మలమడుగు, పెద్దముడియం, మైలవరం, కొండాపురం, ముద్దనూరు మండలాల చైర్‌పర్సన్లు, కమిటీ మెంబర్లు ఆయా మండలాల సీఈఓలకు రాజీనామా పత్రాలు సమర్పించినట్లు తెలుస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా పరాజయం కావడం ఆ పార్టీ సంబంధిత ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కమిటీ నేతలు రాజీనామాలు సమర్పించినట్లు తెలిసింది. జమ్మలమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్ శివాంజనేయరెడ్డి, కమిటీ మెంబర్లు మార్తల పెద్ద ఓబుళరెడ్డి, మల్కిరెడ్డి సరోజమ్మ, ముడిమెల వెంకటకృష్ణారెడ్డి, తల్లపురెడ్డి బాబుల్‌రెడ్డి (పెద్దముడియం మండలం), శెట్టి సూర్యప్రతాప్, శిరయపు శివారెడ్డి, సానె రామచంద్రుడు(ముద్దనూరు), కొండు వాసుదేవరెడ్డి, చిక్కని రాజా, పాపిరెడ్డిగారి వెంకటమోహన్‌రెడ్డి(కొండాపురం), పి.మునిసుధీర్‌రెడ్డి, పి.వెంకటశివుడు(మైలవరం), తదితరులు ప్రొద్దుటూరు డివిజన్ కార్యాలయ అధికారి సురేష్, జమ్మలమడుగు సబ్‌డివిజన్ అధికారి ప్రభాకర్‌రావు, ఆయా మండలాల్లోని సీఈఓలకు రాజీనామా పత్రాలు అందించినట్లు కమిటీల మెంబర్లు, చైర్‌పర్సన్లు ఇచ్చిన పత్రాలను డివిజన్ కార్యాలయానికి పంపినట్లు తెలిపారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

కురబలకోట, జూన్ 8: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు. కదిరి రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కురబలకోట రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని యువకుడు (35) రైలు కిందపడి మృతి చెందాడు. గమనించిన రైల్వే సిబ్బంది, స్థానికులు కదిరి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి పోస్టుమార్టమ్ నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కదిరి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం

మదనపల్లె టౌన్, జూన్ 8: ప్రశాంతనగర్‌లోని ఓ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగి రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లింది. మదనపల్లె ఫైర్ ఆఫీసర్ శివప్ప కథనం మేరకు..స్థానిక ప్రశాంత్‌నగర్ 11వ క్రాస్ వీధిలో పి.ప్రమీల ఇంట్లో మంటలు అంటుకున్నాయని సమాచారం వచ్చిందన్నారు. దీంతో తమ సిబ్బందితో, అగ్నిమాపక యంత్రం, సామగ్రితో సంఘటన స్థలానికి వెళ్లి మంటలను ఆర్పివేశామన్నారు. అప్పటికే వస్తువులు, దుస్తులు, ఫర్నీచర్ కాలిపోయాయన్నారు.

కాల్వపల్లె రోడ్డంటే హడల్

వైసీపీ ప్రభుత్వంలో మరమ్మత్తులు శూన్యం ● చౌడసముద్రం - రహదారి శిథిలం ● దుస్థితికి చేరడంతో వాహనదారుల అవస్థలు



కాల్వపల్లె సమీపంలో కంకర తేలిపోయి దుస్థితికి చేరుకున్న రోడ్డు

ములకలచెరువు, జూన్ 8: చౌడసముద్రం - కాలువపల్లె రోడ్డంటే అందరికీ హడల్. ఈ శిథిలమైన ఈరోడ్డుపై వెళ్లాలన్నా, రావాలన్నా కత్తిమీద సాములాంటిదే. ప్రతి విషయానికీ రాకపోకలు సాగించాలన్నా, రైతులు వ్యవసాయ దిగుబడులను మార్కెట్‌కు తరలించలన్నా, ఎరువులు, విత్తనాల వంటివి కావాలంటే ఏ వాహనమైనా ఇదే రోడ్డుగుండా వెళ్లాల్సిందే. ఇక అత్యవసర సేవలైన ఆస్పత్రులకు వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడంలేదు. ఆటోలు, ద్విచక్రవాహనాలు వెళ్లాలన్నా రోడ్లు బాగుండాలి. అలాంటాది పల్లె దారి శిథిలమైంది. చౌడసముద్రం - కాల్వపల్లె రోడ్డు చెప్పరానంతగా దుస్థితికి చేరింది. వైసీపీ ప్రభుత్వంలో రోడ్ల దుస్థితి చెప్పనవసరం లేదు. రోడ్ల మరమ్మత్తులకు చిల్లి గవ్వ కూడా విదల్చలేదు. రోడ్డంతా గుంతలమయమై దుస్థితికి చేరుకోవడం, పలు చోట్ల కంకర తేలిపోవడంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటే హడలెత్తిపోతున్నారు. చౌడస ముద్రం నుంచి కాల్వపల్లె వరకు ఉన్న సుమారు ఎనిమిది కిలో మీటర్ల రోడ్డు దెబ్బతినింది. దీంతో చౌడసముద్రం నుం చి గుత్తావారిపల్లె, గుత్తావారిపల్లె తాండా, కనికలతండా, నెమ్మచెర్లబావి, రెడ్డివారిపల్లె, కురవాండ్లపల్లె, కాల్వపల్లె వరకు ఉన్న రోడ్లలో వాహనదారులు రాకపోకలు సాగించాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు రోడ్డు మరమ్మత్తుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సెంట్రల్ బోలేవార్డులో నిలిచిన వర్షపునీరు

వానొస్తే తోడేయాల్సిందే

● బోలేవార్డు కోసం రూ.5కోట్లు ఖర్చు
● లోపభూయిష్టంగా నిర్మాణ పనులు
● వర్షపునీటితో ప్రజలకు తప్పని తిప్పలు

పులివెందుల టౌన్, జూన్ 8: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గంలోనూ వర్షం కురిస్తే మోటార్లు పెట్టి నీటిని తోడాల్సిందే. కోట్ల రూపాయలు ఖర్చుతో చేపట్టిన పనులు సైతం లోపభూయిష్టంగా తయారయ్యాయి. ఫలితంగా ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. వివరాల్లోకెళితే...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత సొంత నియోజకవర్గం పులివెందులను సుందరీకరణ చేపట్టి అందమైన నగరంగా తీర్చిదిద్దాలని కోట్ల రూపాయలు వెచ్చించారు. పట్టణ నడిబొడ్డున పాత సత్రం స్కూల్ నుంచి కడప రోడ్డులోని పాత బస్టాండ్ వరకు సుమా రు రూ.5.40కోట్లతో సెంట్రల్ బోలే వార్డును నిర్మించారు. కానీ వర్షం వచ్చిందంటే చాలు బోలేవార్డు కాస్తా బురద వార్డుగా మారుతోంది. నిలిచిన నీటిని ట్యాంకర్లతో మున్సిపల్ పారిశుధ్యం కార్మికులు తోడేల్సిందే. నిర్మించే సమయంలో ఇంజనీర్లు లోపభూయిష్టమైన ప్రణాళికతో నిర్మించారు. వర్షపునీరు బయటకు పోవడానికి మార్గం లేకుండా నిర్మాణ పనులు చేయడంతో ఆ మార్గాన నడవాలంటే ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి నిర్మించిన సెంట్రల్ బోలేవార్డుతో నేడు వర్షపు నీటితో అవస్థలు పడుతున్నారు. కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయింది. కేవలం కాంట్రాక్టర్ కోసమే పనిచేశారా అన్నట్లుగా ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు సెంట్రల్ బోలేవార్డు పనులను పర్యవేక్షించారా లేక కాంట్రాక్టర్ తనకు లాభసాటికోసం ఇష్టమొచ్చినట్లు సెంట్రల్ బోలేవార్డును నిర్మించారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వర్షం వస్తే ఎక్కడ చూసినా వర్షపునీరు నిలుస్తోంది. చిన్నపాటి వర్షం పడితేనే ఎక్కడచూసినా నీరు నిలుస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులను గురిచేస్తున్నాయి. షాపుల యజమానులకైతే అక్కడ నిలిచిన మురికినీటితో తిప్పలుతప్పడం లేదంటున్నారు.సెంట్రల్ బోలేవార్డుపై ప్రత్యేక శ్రద్దవహించి నిర్మించకపోవడం వల్ల ఇటువంటి పరిస్థితి ఏర్పడిందని ప్రజలు అనుకుంటున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేయించారని అందువల్లనే ఎక్కడ చూసినా నీరునిలుస్తోందనే ఆరోపణలున్నాయి. రోడ్డులో ఎత్తుపల్లాలు ఉండడం వల్లే వర్షపునీరు బయటకువెళ్లడం లేదంటున్నారు. సుందరీకరణ కోసం నిర్మించారా, లేక ప్రజల్ని బురదనీటిలో తిరుగుతూ అవస్థలుపడేలా నిర్మాణం నడిబొడ్డున నిర్మించారా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. బోలేవార్డులో వర్షపు నీరు బయటకు వెళ్లేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

స్కూటరును ఢీకొన్న కారు



ప్రమాదానికి కారణమైన కారు

రైల్వేకోడూరు, జూన్ 8: నిలిచి ఉన్న స్కూటరును కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీప్యారడైజ్ సినిమా థియేటర్ సమీప ప్రధానదారిపై బీపీరాచపల్లె వాసి రామచంద్రరాజు నూనె కోసం మిల్లు దగ్గరకు వచ్చాడు. మిల్లు వద్ద తన స్కూటర్‌ను నిలిపి ఉండగా తిరుపతి నుంచి కడప వైపు వెళ్తున్న మహరాష్ట్రకు చెందిన కారు ఢీకొంది. అదే సమయానికి కూలీ పనులకు వెళ్లేందుకు రోడ్డుపై నిలుచున్న సుశీలను కూడా కారు ఢీకొంది. రామచంద్రరాజు తలకు తీవ్ర గాయంకాగా, సుశీలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేశారు. పోలీసులు బాధితులు ఫిర్యాదుతో విచారిస్తున్నారు.

నిత్యాన్నదానానికి రూ.3,00,116 విరాళం

చక్రాయపేట, జూన్ 8: గండి క్షేత్రంలో శాశ్వత నిత్యాన్నదానానికి రూ.3,00,116 విరాళం అందించినట్లు ఆలయ ఏసీ ముకుందరెడ్డి తెలిపారు. శనివారం బెంగళూరు వాసులు నదిపిరాళ్ల సురేష్ కుమార్‌రెడ్డి, సతీమణి మాధవీలత, కుమార్తె మానసరెడ్డి ఈ విరాళం అందించినట్లు తెలిపారు. దాతల కుటుంబ సభ్యులపేరుపై అర్చన చేయించినట్లు ఏసీ తెలిపారు.

బంగారు చోరీపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్8: వైఎస్సార్ కాలనీకి చెందిన మదన మోహన్ ఇంట్లో 70 గ్రాముల బంగారు చోరీ గురైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకుస్థానిక వైఎస్సార్ కాలనీలో మదన్‌మోహన్, అతని భార్య మగ్గాలు నేయడానికి వెళ్లేవారు. వారు పనికి వెళ్లే ముందు ఇంటికి తాళం వేసి తాళాలను బాత్‌రూమ్‌లో ఉంచి వెళ్లతుండేవారు. ఇది పసిగట్టిన వారు ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఇంట్లో ఉన్న 70గ్రాముల బంగారు అపహ రించారు. విషయం తెలుసుకున్న బాధితులు శనివారం చేసిన ఫిర్యాదుపై టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నిందితులను అరెస్టు చేస్తాం : సీఐ

మదనపల్లె అర్బన్, జూన్ 8: వీవర్స్ కాలనీలోని సొంత స్థలంలో ప్రహరీ కూల్చివేసిన నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని మదనపల్లె టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. కాలనీలో సర్వేనెంబరు 102లో 1.26 ఎకరాల భూమి వరదా సురజ్‌శ్రీ నుంచి ఎస్బీఐ కాలనీ వాసి పోతిరెడ్డి వసంత్‌రెడ్డి కొనుగోలు చేశారు. చుట్టూ ప్రహరీ నిర్మించి గేటు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో తనకు పరిచయం ఉన్న కొక్కంటి శివశంకర్‌కు టిప్పర్స్ ట్రాక్టర్స్ పార్కింగ్ చేసుకోవడానికి వసంత్‌రెడ్డి ఆ స్థలం ఇచ్చారన్నారు. మూడు రోజుల కిందట వరదా రెడ్డిశేఖర్, వరదా విద్యాసాగర్, వరదా బాలు, నాగేంద్ర ప్రసాద్ మరికొందరితో కలిసి ప్రహరీని, సీసీ కెమరాలను ధ్వసం చేశారన్నారు. స్థలం యజమాని పోతిరెడ్డి వసంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి కేసు నమోదు చేశారని తెలిపారు.

రామోజీరావు మృతికి ఘననివాళి

మదనపల్లె టౌన్, జూన్ 8: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతిపట్ల పలువురు ఘనంగా శనివారం నివాళులర్పించారు. ప్రపంచంలో తెలుగువాణి వినిపించిన దిగ్గజం రామోజీ లేని లోటు తీర్చలేనిదని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ వద్ద రామోజీ ఫిల్మ్ సిటీలో సందర్శనకు ఉంచిన రామోజీ పార్థివ దేహానికి మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ రామోజీ ఆదర్శవంతుడుగా నిలిచిపోయారన్నారు. స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో రామోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్ మాట్లాడుతూ ఈనాడు గ్రూప్ సంస్థలు ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి చూపిన రామోజీరావు తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు, టీడీపీ నాయకులు జునైద్ అక్బారి, నాదెళ్ల శివన్న, బోయపాటి రామ్మూర్తి, రాటకొండ మధుబాబు, నీలకంఠ, షంషీర్, వినోద్, కృష్ణ పాల్గొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ఆధ్వర్యంలో రామోజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అన్వర్‌బాషా, విజయమ్మ, గణేష్, వెంకటేష్, విద్యా ప్రభాకర్ పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్‌లో: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతికి వీసీకే పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ సంతాపం వ్యక్తం చేశారు. అలాగే ఏపీ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్రడిప్యూటీ జనరల్ సెక్రటరీ అక్కులప్ప శనివారం రామోజీ రావు మృతికి సంతాపం తెలియజేశారు.

ములకలచెరువులో: స్థానిక బస్టాండు సర్కిల్‌లో శనివారం రామోజీరావు చిత్రపటం వద్ద తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాలతో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు చెన్నకిష్టా, కేవీ రమణ, కేశవులు, మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, రమణారెడ్డి, నారాయణస్వామినాయుడు, గొడ్డుమూరు రవి, శవన్న, గాండ్ల రెడ్డెప్ప, నాగేంద్ర, బషీర్, రసూల్, కుళాయప్ప తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో : అక్షర యోధుడు రామోజీరావు మరణం సినీ, పారిశ్రామిక రంగానికి తీరని లోటని పీటీఎం కూటమి నేతలు అన్నారు. శనివారం మండల కేంద్రమైన పీటీఎంలోని బస్టాండులో రామోజీరావు చిత్రపటానికి పలువురు కూటమి నేతలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్(చిన్నా), జనసేన మండల అధ్యక్షుడు శంకర,రాజేష్, చాపల వెంకట్రమణ అంకిరెడ్డిపల్లె రమేష్‌రెడ్డి, మేస్త్రీ రెడ్డి, పాలగిరి రామాంజులు, భజంత్రి రామచంద్ర, నందిమూర్తి, హరిబాబు, వీరాంజీ, మస్తాన్, రాఘవ, సప్పి రాజు, తదితరులు పాల్గొన్నారు.

కురబలకోటలో: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి అన్ని వర్గాల ప్రజలకు తీరనిలోటని రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి...సురేంద్రయాద్ పేర్కొన్నారు. మండలంలోని అంగళ్లు కూడలిలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పత్రికా రంగంలో అయన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో అయూబ్‌బాషా, బాలకృష్ణారెడ్డి, రమణ, విశ్వనాథ్, సదాశివ, అనిల్, బావాజీ , శంకరరెడ్డి, చిన్నప్పరెడ్డి, రెడ్డిశేఖరరెడ్డి, అశోక్ పాల్గొన్నారు.



ఫిల్మ్‌సిటీలో రామోజీ పార్థివ దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



ములకలచెరువులో రామోజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

వాల్మీకిపురంలో: రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతి పట్ల వాల్మీకిపురంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో రామోజీ చిత్రపటం వద్ద నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, పీలేరు పార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ ఎంపీపీలు వల్లిగట్ల రమణ, సురేంద్రవర్మ, నాయకులు వీవీ నారాయణ, రాజేంద్రాచారి, మురళి, బొక్కసం బ్రదర్స్, కువైట్ సయ్యద్‌బాషా, అడ్వకేట్ రమణ, డిష్ బ్రదర్స్, సైదు, టైలర్ రాజు, కలందర్, గాంధీపేట రెడ్డి, సాంబ, జావీద్, శంకర్, గోవిందు, కేకే నాయుడు, మహ్మద్‌హుస్సేన్ పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతిపట్ల రాజకీయ పార్టీల నేతలు శనివారం ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని పెద్దమండ్యం, సిద్దవరం గ్రామాల్లో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్, టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు నార గంగాధర, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హసీంసాబ్, రామాంజులునాయుడు, సయ్యద్‌షావలి, తుమ్మల నాగేశ్వర, నాగేశ్వరరెడ్డి, సాంబశివ, రఘునాథరెడ్డి, ప్రభాకరరెడ్డి, మోహన, ఖాదర్‌హుస్సేన్, రామచంద్ర, ఓబులేసు పాల్గొన్నారు.

గుర్రంకొండలో: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతికి గుర్రంకొండలో టీడీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఇందులో భాగంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతికా రంగంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌కుమార్, చలమారెడ్డి, ఎల్లుట్ల మురళీ, మేకల చలపతి, సుంకర శేఖర్, రామయ్య, సుధాకర్, రామాంజులు, అనిల్, సుబ్బరాజు, రంజిత్, తారక, సుబ్బయ్య, చిన్నరెడ్డి, భాస్కర్‌లు పాల్గొన్నారు. రామోజీరావు మృతికి గుర్రంకొండలో విలేకర్లు నివాళులర్పించారు.

తంబళ్లపల్లెలో: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మరణం పత్రికా రంగానికి తీరని లోటని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం తంబళ్లపల్లెలో టీడీపీ నాయకులు రామోజీరావు మృతి పట్ల నివాళులర్పించి సంతాపం తెలిపారు. సమాజానికి రామోజీరావు చేసిన కృషిని కొనియాడారు.

కలకడలో: ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు మృతి తెలుగు ప్రజానికానికి తీరని లోటని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం కలకడలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో నాయకులు మద్దిపట్ల వెంకటరమణనాయుడు, రైసుమిల్లు రమణ, కోట శ్రీనివాసులునాయుడు, మల్లయ్య నాయుడు, ఈశ్వరయ్య, రాజీవ్, నౌషద్‌ఇస్లాం, ముబారక్‌అలీ, సాగర్, మహ్మద్‌రఫీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: మీడియా మొఘల్‌గా పిలవబడే రామోజీరావు మరణం సినీ, పారిశ్రామిక, మీడియా రంగాలకు తీరని లోటని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ పేర్కొన్నారు. రామోజీరావు మృతి పట్ల పట్టణంలోని జ్యోతి చౌక్‌లో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, కొబ్బరికాలు కొట్టి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామిరెడ్డి, కుడుం శ్రీనివాసులు, బంగారు వెంకట్రమణ, డి.నారాయణ, కనకంటిప్రసాద్, చావిడి కిట్టన్న, నాసిర్, మోదీన్‌బాషా, యండి మస్తాన్, సమీవుల్లా, గంజిమోహన, శిల్పాఅంజి, శరత్, రంజిత్, దేవుడునాగరాజు, సలీం, సురేంద్ర, శ్రీనాథ్, ఓబులేసు, రెడ్డిప్ప, గూళిగారి ప్రభాకర్ పాల్గొన్నారు.

కలికిరిలో: ఈనాడు సంస్థల యజమాని చెరుకూరి రామోజీ రావు మరణం రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన మృతిని జీర్ణించుకోలేకపోతున్నట్లు చెప్పారు. శనివారం రాత్రి ఆయన నగరిపల్లెలో మాట్లాడుతూ అప్రజామికంగా వ్యవహరించే ప్రభుత్వాల వైపు రామోజీ రావు ఎక్కుపెట్టే అక్షరాయుధాలు ప్రజల పక్షంగా కొనసాగేవని కితాబిచ్చారు. నమ్మిన సిద్ధాంతాల కోసం అలుపెరుగని పోరాటం చేసిన రామోజీ రావు ప్రజాస్వామిక వాదులందరికీ చిరస్మరణీయుడని ఆయన ఘనంగా నివాళులర్పించారు.



బి.కొత్తకోటలో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పీటీఎంలో నివాళులర్పిస్తున్న నాయకులు



వాల్మీకిపురంలో రామోజీరావుకు నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

శాంతి భద్రతల నిర్వహణలో రాజీ పడొద్దు

● పోలీసులకు కిశోర్‌కుమార్ రెడ్డి హితవు

కలికిరి, జూన్ 8: సమాజంలో శాంతి భద్రతలను కాపాడే విషయంలో పోలీసులు రాజీ పడకుండా అంకిత భావంతో పనిచేయాలని పీలేరు టీడీపీ ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి హితవు చెప్పారు. శనివారం రాత్రి నగరిపల్లెలో నియోజకవర్గానికి చెందిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో కిశోర్‌కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో వాల్మీకిపురం, కలకడ, పీలేరు సీఐలు పులి శేఖర్, శ్రీనివాసులు, మోహన్ రెడ్డి, ఎస్ఐలు నాగేశ్వరరావు, నాగార్జున రెడ్డి, కరీముల్లా, నరసింహా, అన్ని పోలీసు స్టేషన్ల నుంచి సిబ్బంది తదితరులున్నారు.



కిశోర్‌కుమార్ రెడ్డికి అభినందనలు చెపుతున్న పోలీసు అధికారులు

ఫైబర్ నెట్‌లో ఏబీఎన్ ప్రసారాల పునరుద్ధరణ

కలికిరి, జూన్ 8: ప్రభుత్వ ఫైబర్ నెట్ కేబుల్ సర్వీసుల ద్వారా ఏబీఎన్ ప్రసారాలను ప్రభుత్వం పునరుద్ధరించింది. కోర్టులు ఆదేశించినా, నియంత్రిత సంస్థలు చొరవ తీసుకున్నా ఖాతరు చేయకుండా గత ఐదేళ్ల నుంచి జగన్ ప్రభుత్వం ఏబీఎన్ ప్రసారాలు జరుగకుండా అడ్డుకున్న విషయం తెలిసిందే. ఏబీఎన్‌తోపాటు ఈటీవీ, టీవీ5 న్యూస్ చానెళ్ళను ప్రసారం చేయకుండా ప్రభుత్వం నిషేధించింది. అయితే ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టనుండడంతో శుక్రవారం నుంచి ప్రసారాలను స్వచ్ఛందంగా పునరుద్ధరించారు. కొత్త ప్రభుత్వం ఇంకా కొలువుదీరకున్నా అధికారులు చొరవ తీసుకుని జరిగిన తప్పును సరిదిద్దుకున్నారు. కొత్త ప్రభుత్వం బాధ్యతలు తీసుకుంటే ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనన్న ఆందోళనతో అధికారులే ఏకపక్షంగా ప్రసారాలను పునరిద్ధరించారని చెపుతున్నారు. కాగా ఏబీఎన్ ప్రసారాలు 55వ చానెల్ ప్రసారమవుతున్నట్లు ఫైబర్ నెట్‌లో పేర్కొంటున్నారు. (అదే విధంగా ఈటీవీ 51, టీవీ5 56వ చానెల్‌లో ప్రసారమవుతున్నాయి.)



ఫైబర్ నెట్‌లో ప్రసారమవుతున్న ఏబీఎన్ కార్యక్రమాలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మెరుగైన విద్య

వాల్మీకిపురం, జూన్ 8: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ద్వారా మెరుగైన విద్యనందించడం జరుగుతోందని ఉన్నత విద్యా కళాశాలల రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బాబు పేర్కొన్నారు. శనివారం వాల్మీకిపురం డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించి వసతుల కల్పన, సౌకర్యాలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ చదవకోరు విద్యార్థినీ, విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరి తమ భవిష్యత్‌ను బంగారు బాటగా మలచుకోవాలన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్థానిక కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో అడ్మిషన్లు ప్రారంభించారన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అడ్మిషన్లు, ఇతర ఇవరాలకు 9440080402 నెంబరును సంప్రదించాలన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ పెద్దప్పరాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ నారాయణస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకుంటున్న టీడీపీ నాయకులు

మదనపల్లె అర్బన్, జూన్ 8: స్థానిక ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో శనివారం మదనపల్లెకు షాజహాన్‌బాషా ఎమ్మెల్యే అయినందుకు టీడీపీ నేతలు శనివారం మొక్కులు తీర్చుకున్నారు. కొండామరిపల్లె పంచాయతీ ఇసుక నూతనపల్లెకు చెందిన జయరామ్‌యాదవ్, అతని కుమారుడు వెంకటరమణ యాదవ్‌లు 108 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా పాల్గొన్న ఎమ్మెల్యే కుమారుడు అక్బరీ, జనసేన నేత శ్రీరాంరామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస, అరాచక, దోపిడీ పాలన పోవాలని ఎన్నికల సమయంలో ఇసుకనూతనపల్లెకు చెందిన టీడీపీ నాయకులు వెంకటేశ్వరుడికి మొక్కుబడి చేసుకున్నారని వారి కోరిక నేరవేరడంతో ఈ రోజు తమ మొక్కుతీర్చుకున్నారని తెలిపారు. టీడీపీ కూటమికి రాష్ట్రంలో ప్రజలు అధిక స్థానాలల్లో గెలిపించారని వారికి అన్ని సంక్షేమం, అభివృద్ధి చేయడానికి రాష్ట్రప్రభుత్వం ముందుంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు, మేకల విజయమోహన్, నాగూర్‌వల్లి, రాటకొండ మధుబాబు, టీడీపీ రూరల్ అధ్యక్షుడు రమణ, జయచంద్ర, బాలమాలి శేఖర్, జీవీ నాయుడు, వినోద్‌కుమార్, పూలమురళి, పెరవలి మధు, తదితరులు పాల్గొన్నారు.



ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

బీసీజీ టీకాతో ఆరోగ్యానికి రక్ష

కలకడ, జూన్ 8:వయోజన బీసీ జీ టీకా ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోందని వైద్యాధికారి డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని గొల్లపల్లె, మండెంవారిపల్లె గ్రామస్థులకు బీసీజీ టీకా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి మరణాల రేటు తీవ్రత తగ్గించడంలో ఈ టీకా సురక్షితమైందన్నారు. ముఖ్యంగా ధూమపానం చేసేవారు, షుగర్ వ్యాధిగ్రస్థులు, క్షయ వ్యాధి బాధితులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెచ్ఈ మహ్మద్‌రఫీ, నాగిరెడ్డి, జయరామయ్య, సుబ్బరత్న, వాణి, కనకమ్మలు పాల్గొన్నారు.



ర్యాలీలో వైద్య సిబ్బంది, ప్రజలు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

వాల్మీకిపురం, జూన్ 8:పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎన్‌సీసీ అధికారి రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ మహాసముద్రాల దినోత్సవం సందర్భంగా శనివారం వాల్మీకిపురం వీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 35వ ఆంధ్రాబెటాలియన్ ఎన్‌సీసీ, చిత్తూరు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ అధికారి రవీంద్రరెడ్డి మాట్లాడుతూ మహాసముద్రాలు, మానవాళికి ఎంతగానో దోహదపడుతున్నాయని, వాటిని కలుషితం చేయడం మంచిదికాదన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, పారిశ్రామిక మురుగు సముద్రంలో కలువకుండా చూడాలని కోరారు. పోటీలలో విజేతలుగా నిలిచిన ఎన్‌సీసీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చిత్రలేఖన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

జాతీయస్థాయిలో మిట్స్ విద్యార్థుల ప్రతిభ

కురబలకోట, జూన్ 8: మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. కళాశా లలో మొదటి సంవత్సరం మెకాని కల్, ఈసీఈ, ఈఈఈ చెందిన విద్యార్థులు గూడూరు నారాయణ ఇం జనీరింగ్ కళాశాలో జరిగిన జాతీయ స్థాయి ప్రాజెక్ట్ ఎక్స్‌పో సింపోజియం పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీలలో ప్రదర్శించిన పరిశోధనలకు ప్రథమ, ద్వితీయ బహుమతిని సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను మెమెంటోలను అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కర స్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి లక్ష్మణరావు తదితరులు అభినందించారు.



ప్రశంసాపత్రాలతో మిట్స్ విద్యార్థులు

విభిన్న ప్రతిభావంతుల విద్యపై ప్రత్యేక దృష్టి

గుర్రంకొండ, జూన్ 8:విభిన్న ప్రతిభావంతుల విద్యపట్ల ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గుర్రంకొండలో ఇంటింటికి తిరిగి విభిన్న ప్రతిభావంతుగల పిల్లలను గుర్తించి పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఐఆర్టీలు ఉమాదేవి, మీనాకుమారిలు పాల్గొన్నారు.

ఇరువర్గాల దాడిలో ముగ్గురిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్8: మదనపల్లె మండలం, కొత్తపల్లె గ్రామం వడ్డిపల్లెలో ఇరువర్గాలు దాడిలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ శేఖర్ తెలిపారు. కొత్తపల్లె గ్రామం వడ్డిపల్లెకు చెందిన వెంకటరమణ భార్య శోభతో కలిసి వెంకటమ్మ భవననిర్మాణ పనులుకు వెళ్లేదని, మేస్త్రీ వద్ద నుంచి కూలీ డబ్బు ఇపించలేదనే నెపంతో శనివారం వెంకటమ్మ శోభతో గొడవపడిందన్నారు. ఇంతలో శోభ కుమారుడు ప్రశాంత్ అక్కడికి వచ్చి మా అమ్మతో గొడవ పడవద్దని చెపుతుండగా వెంకటమ్మ కుమారులు నరేష్, సురేష్‌లు అక్కడికి చేరుకుని ప్రశాంత్‌ను పైకి ఎత్తి కిందపడేశారు. ఈసంఘటనలో ప్రశాంత్ వెన్నముకు దెబ్బతినడంతో ఆస్పత్రికి తరలించారు. శోభ ఫిర్యాదు మేరకు వెంకటమ్మ, సురేష్, నరేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నిందితులను అరెస్టు చేస్తాం : సీఐ

మదనపల్లె అర్బన్, జూన్ 8: పట్టణ సమీపంలోని వీవర్స్ కాలనీలోని సొంత స్థలంలో ప్రహరీ కూల్చివేసిన నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని మదనపల్లె టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. వీవర్స్ కాలనీలో సర్వేనెంబరు 102లో 1.26 ఎకరాల భూమి వరదా సురజ్‌శ్రీ నుంచి ఎస్బీఐ కాలనీ చెందిన పోతిరెడ్డి వసంత్‌రెడ్డి కొనుగోలు చేశారని, చుట్టూ ప్రహరీ నిర్మించి గేటుతోపాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొన్నట్లు తెలిపారు. ఇందులో తనకు పరిచయం ఉన్న కొక్కంటి శివశంకర్‌కు టిప్పర్స్, ట్రాక్టర్స్ పార్కింగ్ చేసుకోవడానికి వసంత్‌రెడ్డి ఆ స్థలం ఇచ్చారన్నారు. మూడు రోజుల కిందట వరదారెడ్డిశేఖర్, వరదా విద్యాసాగర్, వరదా బాలు, నాగేంద్ర ప్రసాద్‌లు మరికొందరితో కలిసి ప్రహరీని, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారన్నారు. స్థలం యజమాని పోతిరెడ్డి వసంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి కేసు నమోదు చేశారని తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్8: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వల్లిబసు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మదనపల్లె పట్టణం, ఎన్వీఆర్ వీధికి చెందిన రహీం అన్సారీ భార్య షేక్ కరిష్మా(35) నెలరోజులుగా కనపడకుండా పోయింది ఈమె అంగళ్లు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి అదృశ్యం అయింది, దీంతో శనివారం భర్త ఫిర్యాదు మేరకు మహిళ అదృశ్యం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

కురబలకోట, జూన్ 8: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం అర్ధరాత్రి కురబలకోట మండలంలో జరిగింది. దీనికి సంబంధించి కదిరి రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కురబలకోట రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని యువకుడు (35) రైలు కిందపడి మృతి చెందాడు. గమనించిన రైల్వే సిబ్బంది, స్థానికులు కదిరి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించి పోస్టుమార్టమ్ నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కదిరి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

బంగారు చోరీపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జూన్8: వైఎస్సార్ కాలనీకి చెందిన మదనమోహన్ ఇంట్లో 70 గ్రాముల బంగారు చోరీ గురైన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు పోలీసుల వివరాల మేరకు మదనపల్లె పట్టణం, వైఎస్సార్ కాలనీలో ఉన్న మదన్‌మోహన్, అతని భార్య మగ్గాలు నేయడానికి వెళ్లేవారని, వారు పనికి వెళ్లే ముందు ఇంటికి తాళం వేసి తాళాలను బాత్‌రూమ్‌లో ఉంచి వెళ్లుతుండేవారు. ఇది పసిగట్టిన వారు ఇంటిలో ఎవ్వరూ లేనిసమయంలో దొంగ తనానికి పాల్పడి ఇంట్లో ఉన్న 70గ్రాముల బంగారు అపహరించారు. విషయం తెలుసుకున్న బాధితులు శనివారం ఫిర్యాదు చేయగా టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య కేసునమోదు చేసి దర్యాప్తు చేపటినట్లు తెలిపారు.

మదనపల్లెలో అగ్నిప్రమాదం రూ.లక్ష ఆస్తి నష్టం

మదనపల్లె టౌన్, జూన్ 8: మదనపల్లె పట్టణం ప్రశాంత నగర్‌లోని ఓ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగి రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లింది. మదనపల్లె ఫైర్ ఆఫీసర్ శివప్ప కథనం మేరకు..స్థానిక ప్రశాంత్‌నగర్ 11వ క్రాస్ వీధిలో పి.ప్రమీల ఇంట్లో మంటలు అంటుకున్నాయని సమాచారం వచ్చిందన్నారు. దీంతో తమ సిబ్బందితో, అగ్నిమాపక యంత్రం, సామాగ్రితో సంఘటన స్థలానికి వెళ్లి మంటలను ఆర్పివేశామన్నారు. అప్పటికే ఇంట్లోని గృహోకరణ వస్తువులు, దుస్తులు, ఫర్నీచర్ కాలిపోయింద న్నారు. ఆస్తి నష్టం సుమారు రూ.లక్ష దాకా వుంటుందని బాధితురాలు తెలిపిందన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడును కలిసిన నేతలు

పెద్దమండ్యం, జూన్ 8: సార్వత్రిక ఎన్నికలలో ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడును టీడీపీ నేతలు కలిశారు. రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి మనోహర్‌నాయక్ శనివారం విజయవాడలోని ఆయన స్వగృహంలో కలిసి మాట్లాడి విజయోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ ఎస్టీసెల్ అధ్యక్షుడు సుబ్బయ్య తదితరులు ఉన్నారు.



అచ్చెన్నాయుడును సన్మానిస్తున్న మనోహర్‌నాయక్

నల్లారి దంపతులకు మక్కా ప్రసాదాలు అందజేత

కలికిరి, జూన్ 8: పీలేరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు మహ్మద్ రఫీ మక్కా నుంచి తెచ్చిన ప్రసాదాలను టీడీపీ ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి, ఆయన సతీమణి తనూజా రెడ్డిలకు అందజేశారు. శనివారం ఆయన నగరిపల్లెలో నల్లారి దంపతులను కలిసి మాక్కా నుంచి తెచ్చిన పవిత్ర జలం (జమ్ జమ్ వాటర్), ఖర్జూరాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఎన్నికల సమయంలో మక్కాకు వెళ్ళి కిశోర్‌కుమార్ రెడ్డి గెలుపు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

టీడీపీ గెలుపుపై ఎన్‌టీఏ సంబరాలు

పీలేరు, జూన్ 8: తెలుగుదేశం పార్టీ విజయంపై శనివారం పీలేరులోని నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) సభ్యులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రెడ్డిరమేశ్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యావ్యవస్థ బలోపేతం అవుతుందన్న నమ్మకం తమకుందన్నారు. టీడీపీ విజయాన్ని ఉద్యోగుల విజయంగా భావిస్తున్నామని, కొత్త ప్రభుత్వం ఉద్యోగులతో స్నేహపూర్వక వాతావరణం ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర నాయకులు తరిగొండ సురేశ్ కుమార్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలోని యాప్స్‌ను రద్దు చేసి ఉపాధ్యాయులను ఒత్తిడి నుంచి దూరం చేయాలన్నారు. ఏపీసీపీఎస్ఈఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ మాట్లాడుతూ జీవో నెం.117ను రద్దు చేయాలన్నారు.



సంబరాలు జరుపుకుంటున్న ఎన్‌టీఏ సభ్యులు

పల్లె దారి శిథిలం...!

● కనీస మరమ్మతులకు నోచుకోని వైనం

ములకలచెరువు, జూన్ 8: రహదారులు బాగుంటే పల్లె ప్రజలకు సగం కష్టాలు తప్పుతాయి. రైతులు వ్యవసాయ దిగుబడులను మార్కెట్‌కు తరలించలన్నా...ఎరువులు, విత్తనాల కోసం వెళ్లాలన్నా ఆస్పత్రులకు వెళ్లాలన్నా ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ఆధారపడి ప్రయాణం సాగిస్తారు. అలాంటాది పల్లె దారి శిథిలమైంది. మండలంలోని చౌడసముద్రం - కాలువపల్లె రోడ్డు దుస్థితికి చేరింది. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాలంలో రోడ్ల మరమ్మతులకు చిల్లిగవ్వ కూడా విదల్చలేదు. దీంతో ఈ మార్గంలో ప్రయాణం అంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. చౌడసముద్రం నుంచి కాలువపల్లె వరకు సుమారు ఎనిమిది కిలో మీటర్ల రోడ్డు దెబ్బతింది. దీంతో చౌడసముద్రం గుత్తావారిపల్లె, గుత్తావారిపల్లె తాండా, కనికలతాండా, నెమ్మచెర్లబావి, రెడ్డివారిపల్లె, కురవాండ్లపల్లె, కాలువపల్లె వరకు ఉన్న రోడ్లులో వాహనదారులు వెళ్లాలంటే హడలిపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కాలువపల్లె సమీపంలో కంకర తేలిపోయిన రోడ్డు

రేపటి నుంచి అమ్మవారి జాతరలు

కలికిరి, జూన్ 8: మండలంలోని గుండ్లూరు, గుట్టపాళెం గ్రామాల్లో ఆదివారం నుంచి అమ్మవార్ల జాతరలు వైభవంగా జరుగనున్నాయి. గుండ్లూరు మూలస్థానమ్మ అమ్మ వారి జాతరకు సంబంధించి శనివారం రాత్రి సిద్ధ పూజా కార్యక్రమం పూర్తయింది. ఆదివారం ఉదయం శిల్లు, బోనాలు, రాత్రికి చాందినీ బండ్లు, చెక్క భజనలతో ప్రత్యేక కార్యక్రమాలుంటాయని నిర్వాహకులు తెలిపారు. సోమవారం పుష్ప పల్లకి సేవతోపాటు అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుంది. ఇక గుట్టపాళెం పాలేటమ్మ వారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. అమ్మవారి మెట్టినిల్లు వారిచే సిద్ధ పూజ, నగరి బోనం ఏర్పాటు చేస్తున్నారు. రాత్రికి చాందినీ బండ్ల ఊరేగింపు ఉంటుంది.

ఆదివారం ప్రత్యేకం

కంచి అనగానే మగువలకు గుర్తొచ్చేది అందమైన పట్టుచీరలు.ఇక్కడ తయారయ్యే పట్టు, బంగారు, వెండి, జరీ చీరలకు దేశవ్యాప్తంగా ఎంతో క్రేజ్ . ఈ కంచిపట్టు చీరల తయారీ వెనుక నేతన్నల కష్టంతో పాటు పన్నికట్టు కళాకారుల సృజనాత్మకత కూడా దాగి వుంది.

పన్నికట్టు @ రామిరెడ్డి పాళెం



- ప్రధాని ప్రశంసలందుకున్న పన్నికట్టు కళాకారులు
- కంచి పట్టుచీరల తయారీలో 'పన్ని' ప్రధాన భూమిక





పన్ని తయారీకి ఉపయోగించే జొన్న దంటు, వెదురు పుల్లలు

సత్యవేడు, జూన్ 8 : కంచి పట్టుచీరల తయారీలో పన్ని అనే పరికరం ప్రధాన భూమిక పోషిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే 'పన్ని' లేనిదే కంచి పట్టు చీరల తయారీ కుదరదు. పొందూరు ఖాదీ తయారీలో 'వాలుగ చేప దవడ' పరికరం ఎంత ముఖ్యమో, కంచి పట్టుచీరల తయారీలో కూడా ఈ పన్ని అంతే ముఖ్యం. పట్టు వస్త్రాల తయారీలో నిలువు, అడ్డు పోగులను సరైన క్రమంలో అమర్చే పరికరం పేరే పన్ని. కంచి పట్టు చీరల తయారీకి అవసరమయ్యే 'పన్ని' మన రాష్ట్రంలో రెండు ప్రాంతాల్లోనే తయారు చేస్తారు. ఒకటి నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు కాగా, రెండు మన జిల్లాలోని వరదయ్యపాళెం మండలంలోని రామిరెడ్డి పాళెం.ఈ రెండు ప్రాంతాల నుంచే కంచికి పన్ని సరఫరా అవుతోంది. జొన్నదంటు, వెదురు పుల్లలు చీల్చి తయారు చేసే ఈ పరికరాన్ని కంచి నేతన్నలకు సరఫరా చేస్తూ ఇక్కడి కళాకారులు జాతీయ ఖ్యాతి దక్కించుకున్నారు.బయటి ప్రపంచానికి పెద్దగా తెలియని ఈ పన్నికట్టు కళను చూసి ప్రధాని నరేంద్ర మోదీ సైతం ఇటీవల ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ కళాకారులను ప్రశంసించారు. వరదయ్యపాళెం మండలం రామిరెడ్డి పాళెంలో 30 కుటుంబాలు ఈ పన్నికట్టు మీదనే ఆధారపడి బ్రతుకుతున్నాయి.పూర్వీకుల నుంచి వారసత్వంగా అందిన ఈ కళను బ్రతికించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చేనేత కార్మికుల తరహాలో ప్రభుత్వాలు తమను ఆదరించక పోయినా నమ్ముకున్న ఈ వృత్తిని, అరుదైన ఈ కళను అంతరించి పోకుండా కాపాడుకుంటూ, తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

పన్ని తయారీ విధానం

తమిళనాడు రాష్ట్రం ధర్మపురి నుంచి జొన్న దంటు, బుచ్చినాయుడు కండ్రిగ మండలం పెళ్కూరు నుంచి వెదురు పుల్లలు సేకరించుకుని బాగా ఎండబెడతారు. ఎండిన జొన్నదంటును మూడు నుంచి, మూడున్నర ఇంచీల లెక్కన సుమారు మూడువేల పుల్లలను సన్నగా చీల్చుకుంటారు.వీటిని గూటంలో పేర్చి పదునైన చిన్నపాటి కత్తులతో గరుకుల్లేకుండా మృదుత్వం వచ్చే వరకు చివ్వుకుంటారు. అనంతరం బాగా ఎండిన వెదురు పుల్లలను ఒకటిన్నర సెంటీమీటర్ మందంతో నాలుగు దబ్బలుగా చీల్చుకుంటారు. చీల్చిన దబ్బల నుంచి పైన రెండు దబ్బలు, కింద రెండు దబ్బలను మూడు అంగుళాల వెడల్పు పెట్టి ఒక ప్రత్యేక పరికరంలో అమర్చుకుంటారు. ఈ వెదురు దబ్బల సందుల్లోంచి, చీల్చిన జొన్నదంటు పుల్లలను ఒక్కొక్కటిగా పేర్చుకుంటూ దారంతో కడుతూ ముడి వేస్తారు. ఇలా మూడువేల జొన్నదంటు పుల్లలను కట్టి పన్ని తయారు చేస్తారు. ఒక్క పన్ని తయారు చేయాలంటే సుమారు రెండు రోజులు పడుతుంది. ఈ మొత్తం ప్రక్రియలో ఇంటిల్లిపాదీ సహనంతో పని చేయాల్సి ఉంటుంది. ఇంత చేసినా ఒక్క పన్ని విక్రయిస్తే వారికి దొరికేది రూ.వెయ్యికన్నా తక్కువే. అదే వారి కూలి, అదే లాభం కూడా.

అంతరించిపోతున్న అరుదైన కళ

పన్ని కళాకారులను ప్రభుత్వాలు గుర్తించకపోవడంతో పాటు శ్రమకు తగిన ప్రతిఫలం లేకపోవడంతో ప్రస్తుతం ఈ వృత్తిలోకి కొత్తగా ఎవరూ రావడం లేదు. పూర్వీకుల నుంచి తమకు వారసత్వంగా అబ్బిన ఈ వృత్తిపై ఉన్న మమకారంతో కొంతమంది వదులుకోలేక కొనసాగుతున్నారు. ప్రస్తుతం రామిరెడ్డి పాళెంలో 30 కుటుంబాల వారు మాత్రమే ఈ వృత్తిలో వున్నారు.అంతరించి పోతున్న ఈ అరుదైన కళను ప్రభుత్వం ప్రోత్సహించి, కాపాడాల్సిన అవసరం ఉంది.

ప్రధాని ప్రశంసలు

ఆజాదీకా అమృత మహోత్సవ్ ఉత్సవాల్లో భాగంగా స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించిన చేనేత రంగంలో దేశవ్యాప్తంగా నిష్ణాతులైన కార్మికులను కేంద్ర ప్రభుత్వం సన్మానించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గత ఏడాది ఆగస్టు 7వ తేదీన జరిగిన జాతీయ చేనేత దినోత్సవంలో కేంద్ర ప్రభుత్వం రామిరెడ్డిపాళెం పన్ని కళాకారులను ఆహ్వానించి గౌరవించింది. గ్రామానికి చెందిన పన్ని కళాకారులు షేక్ బషీర్, షేక్ వహీద్ ఢిల్లీలోని ప్రగతి భవన్‌లో జరిగిన చేనేత ప్రదర్శనకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి పన్ని తయారీ గురించి ప్రత్యక్షంగా వివరించి మన్ననలందుకున్నారు.



ఇంటిల్లిపాదీ పనిచేస్తాం



ఇంటిల్లిపాదీ రెండు రోజులు పనిచేస్తే ఒక పన్ని తయారవుతుంది.దాన్ని విక్రయిస్తే ఖర్చులు పోనూ రూ.వెయ్యి కూడా మిగలడం లేదు. అరుదైన ఈ కళ అంతరించిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. చేనేత రంగానికి అందించే సంక్షేమ పథకాలు, సబ్సిడీ రుణాలు అందించి ఆదుకోవాలి.

- ఎస్‌కే బాషా

ప్రభుత్వం ఆదుకోవాలి



చేనేత మగ్గాలకు పన్ని ఊపిరిలాంటిది. పన్ని లేనిదే పట్టుచీరలు నాణ్యతగా తయారీ కాదు. తరతరాలుగా మేము పన్ని తయారీలోనే బ్రతుకుతున్నాం. ఇది చాలా ఓర్పుతో కూడుకున్న పని.కూర్చున్న చోటు నుంచి కదలకుండా గంటలపాటు ఉండాల్సి వస్తుంది. ఇది పన్ని కళాకారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కొద్ది కాలానికే శరీరం పటుత్వం కోల్పోతుంది. నేత కార్మికులను ఆదుకున్నట్లే మమ్మల్ని కూడా ప్రభుత్వం ఆదరించాలి. వారిలాగే సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. నేత కార్మికులకు ఇచ్చినట్లే పింఛన్ కూడా మంజూరు చేయాలి.

- షేక్ బషీర్ సాహెబ్

వైసీపీలో అంతర్మథనం

భవిష్యత్తుపై బెంగ - టీడీపీ గూటికి చేరేందుకు రాయబారాలు

పుత్తూరు అర్బన్, జూన్ 8: వైసీపీలో అంతర్మథనం మొదలైంది. టీడీపీ సాధించిన అసాధారణ విజయంతో వైసీపీ కేడర్ డోలాయమానంలో పడింది. తమ భవిష్యత్తుపై బెంగ పెట్టుకుంది. టీడీపీ గూటికి చేరేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకు ఆయా మండలాల్లో కీలక నాయకులతో టచ్‌లోకి వెళుతోంది.


రానున్న ఐదేళ్లు ఎలాగబ్బా... : రోజా అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ ఎన్నికలకు ముందే ఒక్కొక్క కీలక నాయకుడూ పార్టీకి గుడ్‌బై చెప్పేస్తున్నా, సంక్షేమ పథకాలు గెలిపిస్తాయనే నమ్మకం కొందరిలో ఉండేది. అయితే గాలి భానుప్రకాష్ 45,004 ఓట్ల మెజార్టీతో గెలిచాక గానీ రోజాపై నియోజకవర్గంలో ఇంత వ్యతిరేకత ఉందనే విషయం తెలియలేదు. దీంతో తమ భవిష్యత్తుపై బెంగ పెట్టుకుంటున్నారు. గత రెండు ఎన్నికల్లో నగరి నుంచి వైసీపీ బొటాబొటీ మెజార్టీతో గెలిచింది. దీంతో వాపును చూసి బలుపనుకుని అధికారం ఉన్న ఐదేళ్లలో టీడీపీ కేడర్‌ను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన వైసీపీ నాయకులు ఇప్పుడు బెంబేలెత్తిపోతున్నారు. భవిష్యత్తును తలుచుకుని లోలోన కుమిలిపోతున్నారు. మరోవైపు రెండు రోజులుగా మండలాల వారీగా నగరిలో మాజీ ఎమ్మెల్యే రోజా ఫలితాలపై సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అండగాఉంటానని భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే కేడర్‌లో మాత్రం ఆత్మస్థైర్యం నింపలేకపోతున్నారు. ఎన్నికలకు ఇంకా ఐదేళ్ల సమయం ఉండడంతో టీడీపీతో రాజకీయ పోరాటం చేయగలమా అనే సందేహంలో పడిపోయారు.

టీడీపీతో రాయబారాలు : పుత్తూరు, నగరి మున్సిపాలిటీలకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు టీడీపీతో టచ్‌లోకి వెళుతున్నారు. గత ఐదేళ్లలో తాము టీడీపీ కేడర్‌ను ఎలాంటి ఇబ్బందులు పెట్టలేదని సంజాయిషీ ఇచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏ పరిస్థితుల్లో తాము వైసీపీలో కొనసాగాల్సి వచ్చిందనే విషయాలను ఏకరువు పెడుతున్నారు. టీడీపీ గూటికి చేరేందుకు లైన్ క్లియర్ చేయించమని అడుగుతున్నారు. అయితే నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మనసు తెలిసిన టీడీపీ నాయకులు ఈ విషయాన్ని ఆయన ముందు ఉంచేందుకు మాత్రం సాహసించలేకపోతున్నారు. భానుప్రకాష్ వైఖరి ఎలా ఉంటుందో అని ఆందోళన చెందుతున్నారు. గత ఐదేళ్లలో నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ నాయకులు చేసిన దోపిడీపై విచారణ జరిపిస్తానని భానుప్రకాష్ ప్రకటించడం వారిలో గుబులు రేపుతోంది.

రేపటినుంచి ఎస్వీయూలో తరగతులు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 8: ఎస్వీయూనివర్సిటీలో సోమవారం నుంచి పీజీ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఆదివారంతో వేసవి సెలవులు ముగియనున్నాయి. దీంతో పీజీ 4, 2వ సెమిస్టర్ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ అధికారులు సర్క్యులర్ జారీ చేశారు.

గంగన్న శిరస్సు జలపాతంలో పర్యాటకుల సందడి



పలమనేరు, జూన్8 : పలమనేరు మండలం మండిపేట కోటూరు అటవీ ప్రాంతంలోని గంగన్న శిరస్సు జలపాతం వద్ద పర్యాటకుల సందడి మొదలైంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గంగన్న జలపాతం ఇప్పుడిప్పుడే ప్రవహిస్తోంది. పట్టణ ప్రజలు జలపాతాన్ని సందర్శిస్తున్నారు. మండలంలోని కల్యాణరేవుల జలపాతంలో వర్షాకాలంలో మూడు నెలలకు పైగా పర్యాటకుల సందడి ఉంటుంది. కౌండిన్య నదీ జలాలు ప్రవహించే రోజుల్లో ఈ జలపాతం ఆకట్టుకునేలా ఉంటుంది. బైరెడ్డిపల్లి మండలం కైగల్ నదీ పరివాహక ప్రాంతంలో దుముకురాళ్ల జలపాతం వర్షాకాలంలో పర్యాటకులతో కళకళలాడుతుంది. ఈ మూడు జలపాతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. అంతేగాక కైగల్ నదీజలాలు తమిళనాడుకు తరలిపోకుండా ప్రాజెక్టు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

మేకలు కనిపించలేదని విద్యార్థి ఆత్మహత్య

వి.కోట, జూన్ 8: మేకలు కనిపించలేదని మండలంలోని యాలకల్లు పంచాయతీ ఎర్రినాగేపల్లె గ్రామానికి చెందిన కోదండప్ప కుమారుడు సంజయ్(11) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 5వ తరగతి చదువుతున్న సంజయ్ పాఠశాలకు సెలవులు కావడంతో వారికున్న మేకలను మేపేందుకు అడవికి తోలుకెళ్లాడు. సాయంత్రానికి వాటిలో కొన్ని కనిపించకపోవడంతో ఇంటికెళితే తిడతారని భయపడ్డాడు. దీంతో పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. తోటి కాపరులు ఈ విషయాన్ని గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. వి.కోట పోలీసులు అక్కడికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బర్డ్‌లో రోగులకు కృత్రిమ అవయవాల వితరణ



తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బర్డ్ ఆస్పత్రిలో శనివారం 110 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను వితరణ చేశారు. ఇటీవల తమిళనాడు ధర్మపురికి చెందిన సుబ్రమణియన్ అనే దాత బర్డ్ ఆస్పత్రిలో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ఆధునికీకరణకు రూ.కోటి విరాళంగా అందించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా యూకే సాంకేతికతో ఎండోలైట్ కంపెనీ సహకారంతో తయారు చేసిన ఎక్కువ మన్నిక గల కృత్రిమ అవయవాలను ఉచితంగా ఇచ్చారు. బర్డ్ ఆస్పత్రి చేస్తున్న సేవలకుగాను ఎండోలైట్ కంపెనీ అసలు ధరలో 50శాతం రాయితీతో అల్యూమినియంతో తయారు చేసిన ఈకృత్రిమ అవయవాలను టీటీడీకి అందించారు. ఇవి సౌకర్యవంతంగా ఉన్నాయని రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. బర్డ్ ఆస్పత్రి డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది, రోగుల బంధువులు పాల్గొన్నారు.

ఆగని ఏనుగుల దాడులు

మామిడి, టమాట తోటలు ధ్వంసం





దెబ్బతిన్న మామిడి చెట్లు, టమాట తోట - టమోటా పంటను నాశనం చేసిన ఏనుగుల గుంపు

సోమల/కల్లూరు, జూన్ 8: సోమల, కల్లూరు మండలాల్లో ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. సోమల మండలం పేటూరు, అన్నెమ్మగారిపల్లె పంచాయతీ ఎర్రగుంతలపల్లె, పొలికిమాకులపల్లె, కల్లూరు మండలం కోటపల్లె సమీపంలోని అటవీ శివారు పొలాల్లోకి శుక్రవారం రాత్రి, శనివారం పట్టపగలే జంట ఏనుగులు వచ్చాయి. పేటూరుకు చెందిన చిట్టి, చంద్రయ్య, సుబ్రమణ్యం మామిడి, టమాట తోటలను తొక్కి నాశనం చేశాయి. డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి. పంటలతోపాటు మామిడి చెట్లు ధ్వంసం కావడంతో రైతుల పరిస్థితి అయోమయంగా మారింది. మామిడి చెట్లు నేల కూలడంతో తీవ్రంగా నష్టపో తున్నామని రైతులు వాపోతున్నారు. టమాట, మామిడికి మంచి ధర ఉందని, ఉన్న కొద్దిపాటి పంటను ఏనుగులు నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్లూరుకు చెందిన రైతు యాసిన్ మామిడి తోటలో టమోటా సాగుచేయగా ఏనుగులు ధ్వంసం చేశాయి. ఈ విషయమై అటవీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

టీ20 ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నీ ప్రారంభం

తిరుపతి(క్రీడలు), జూన్ 8: తుమ్మలగుంట క్రీడా మైదానంలో సౌత్‌జోన్ సీనియర్ టీ20 ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నీ శనివారం ప్రారంభమైంది. లీగ్ దశ పోటీల్లో భాగంగా ఉదయం జరిగిన తొలి మ్యాచ్‌లో అనంతపురం-కడప జట్లు తలపడ్డాయి. కడప జట్టు పొదుపైన బౌలింగ్, చురుకైన ఫీల్డింగ్‌తో ప్రత్యర్థిని 138పరుగుల తక్కువ స్కోరుకే కట్టడిచేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కడపజట్టు 7వికెట్లు కోల్పోయి 13బంతులు మిగిలి వుండగానే లక్ష్యాన్ని ఛేదించింది. మధ్యాహ్నం మ్యాచ్‌లో చిత్తూరు-కర్నూలు జట్లు తలపడ్డాయి. కర్నూలు జట్టులోని బ్యాట్స్‌మెన్స్ రాణించడంతో 169పరుగులతో భారీ స్కోరు చేసింది. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరుజట్టు దీటుగా పరుగుల చేసినా.. విజయం ముగింట చతికిల పడింది. కేవలం ఏడు పరుగుల తేడాతో ఓటమి చవి చూసింది.

11న అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై ఈనెల 11వ తేదీన 11వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం జరగనుంది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఈకార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అయోధ్యకాండలోని 40 నుంచి 44వ సర్గ వరకు ఉన్న మొత్తం 162 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 187 శ్లోకాలను పారాయణం చేస్తారు. ఎస్వీ వేదవిజ్ఞానపీఠం, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ వేదపండితులు, సంభావన పండితులు, అన్నమాచార్య ప్రాజెక్ట్, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పండితులు ఈకార్యక్రమంలో పాల్గొంటారు. ఎస్వీబీసీ ప్రత్యక్షప్రసారం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు ఈ పారాయణంలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని టీటీడీ కోరింది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు

తిరుమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.20 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 63,830 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా 30,810 మంది తలనీలాలు సమర్పించారు. కాగా, శనివారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు రవితేజ శ్రీవారిని దర్శించుకున్నారు.